


GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 133 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శుక్రవారం 01 ఆగష్టు 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్






# దేశ ప్రయోజనాలపై రాజీపడేది లేదు

## ట్రంప్ వాణిజ్య సుంకాలపై పీయూష్ గోయల్

**లోక్‌సభలో ప్రకటించిన కేంద్రమంత్రి**

న్యూఢిల్లీ,జూలై31(సమయజ్యోతి):

దేశ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోనున్నట్లు- వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఆగస్టు 1 నుంచి భారత వస్తువులపై 25శాతం టారిఫ్ విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై.. లోక్‌సభలో పీయూష్ గోయల్ మాట్లాడారు.ఈ టారిఫ్ ప్రభావాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోందన్నారు. భారత ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం అని స్పష్టం చేశారు.గత కొన్ని నెలలుగా భారత్-అమెరికా రెండు దేశాలు సమతుల్య, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయని తెలిపారు.

02

## ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు

# తలొగ్గొద్దు

## కేంద్రానికి శశిథరూర్ సూచన

న్యూఢిల్లీ,జూలై31(సమయజ్యోతి):

ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గదన్ని కాంగ్రెస్ సీనియర్ నేత,ఎంపి శశిథరూర్ అన్నారు. ఇఇ మన వాణిజ్యంపై తీవ్రప్రభావం చూపుతుందని అన్నారు. భారత దిగుమతులపై 25శాతం సుంకంతో పాటు అదనంగా జరిమానాలు విధిస్తున్నట్లు- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు.



2 లో

## సుప్రీం తీర్పుపై నిపుణులతో

# చర్చించి నిర్ణయం

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టీకరణ

హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):



ఫిరాయింపుల ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. తనకు మూడు నెలల గడువు విధించడంపై న్యాయ నిపుణులతో చర్చించాకే తదుపరి నిర్ణయానికి వెళ్తామని అన్నారు. ఈ క్రమంలో ధన్‌ఖడ్ వ్యాఖ్యల ప్రస్తావన తెచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు పై న్యాయ నిపుణులతో చర్చిస్తా. మాజీ ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ ఏం మాట్లాడారో అందరూ చూశారు. వాటిని కూడా మేము పరిశీలిస్తున్నాం. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం. సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించాకే అన్ని వివరాలు త్వరలో చెప్తా అని అన్నారు.

# విమానం గాల్లో ఉండగా భారీ కుదుపులు..

## 25 మంది ప్రయాణికులకు గాయాలు

జూలై31సమయజ్యోతి

అహ్మదాబాద్ విమాన ప్రమాదం అనంతరం ప్రపంచ వ్యాప్తంగా విమానాల్లో తలెత్తుతున్న సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం గగనతలంలో భారీ కుదుపులకు గురైంది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన 56 విమానం బుధవారం సాల్ట్ లేక్ సిటీ నుంచి ఆమ్‌స్టర్‌డామ్ కు బయల్దేరింది.



# భారత ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యం

## కేంద్రంపై రాహుల్ విమర్శలు

న్యూఢిల్లీ,జూలై31(సమయజ్యోతి):



భారతదేశ ఆర్థిక వ్యవస్థ నిర్జీవ స్థితిలో ఉందని ప్రధాని మోడీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మినహా అందరికీ తెలుసునని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వ్యవస్థను బిజెపి నాశనం చేసిందని ధ్వజమెత్తారు. భారత ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ విమర్శ గురించి పార్లమెంట్ ఎదుట గురువారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు. అవును, ట్రంప్ చెప్పింది వాస్తవమేనని, ప్రధాని, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ ఈవిషయం తెలుసునని అన్నారు. ట్రంప్ వాస్తవాన్ని వెల్లడించినందుకు సంతోషిస్తున్నానని అన్నారు. ఇందులో ఆశ్చర్యం లేదని, అదానీకి సహాయం అందించడం కోసం బిజెపి ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని అన్నారు. అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటుందని, ఆవిషయాన్ని ట్రంప్ స్పష్టం చేస్తారని, ట్రంప్ చెప్పినట్లు ప్రధాని మోడీ చేస్తారని అన్నారు. భారతదేశ దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు- ప్రకటించిన తర్వాత, భారత్,రష్యాల ఆర్థిక వ్యవస్థలు నిర్జీవమైనవని అమెరికా అధ్యక్షులు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# మీరు చెప్పే రాజ్యాంగాన్ని ఆచరిస్తారా?

## సుప్రీం తీర్పుపై రాహుల్‌కు హరీష్ రావు ప్రశ్న

హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు- పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.ఈ అంశాన్ని హరీశ్‌రావు ప్రస్తావిస్తూ.. మీరు బోధించే వాటిని మీరు ఆచరించగలరా..? అని రాహుల్ గాంధీని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. మీ తండ్రి దివంగత రాజీవ్ గాంధీ 52వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశపెట్టిన ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్పీకర్‌ను మీరు కోరుతారా..? అని ప్రశ్నించారు. లేదా రాజ్యాంగాన్ని చేతిలో మోసుకెళ్లడం కేవలం ఎన్నికల మోసమా..? అని రాహుల్ గాంధీని హరీశ్‌రావు నిలదీశారు.



## ప్రజ్ఞా ఠాకూర్ సహా

# ఏడుగురు నిర్దోషులే..

## మాలేగావ్ పేలుడు కేసులో ముంబై కోర్టు సంచలన తీర్పు

జూలై31సమయజ్యోతి



మాలేగావ్ పేలుడు కేసులో ముంబైలోని ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితులుగా అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ, బీజేపీ నాయకురాలు ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ , లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురిని ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం సంచలన తీర్పు వెలువరించింది.2008 సెప్టెంబరు 29న మహారాష్ట్రలోని నాసిక్‌లో గల మాలేగావ్‌లో మసీదుకు సమీపంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పేలుడు తీవ్రతకు ఆరుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. వంద మందికి పైగా గాయపడ్డారు. ఈ కేసులో తొలుత యాంటీ టెర్రర్ స్క్వాడ్ (ఏటీఎస్) దర్యాప్తు ప్రారంభించగా.. ఆపై కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏ స్వీకరించింది. ఈ కేసులో ఇప్పటివరకు 220 మంది సాక్షులను విచారించారు.ఈ ఘటనపై 17ఏళ్ల పాటు విచారణ జరగ్గా తాజాగా జస్టిస్? ఏకే లహోటి తీర్పును వెలువరించారు. ఇక ఈ కేసులో ప్రజ్ఞా ఠాకూర్‌తోపాటూ లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, మేజర్ (రిటైర్డ్) రమేష్ ఉపాధ్యాయ్, సుధాకర్ చతుర్వేది, అజయ్ రహిర్కర్, సుధాకర్ ధర్ ద్వివేది అలియాస్ శంకరాచార్య, సమీర్ కులకర్ణిలను నిర్దోషులుగా తేల్చింది.



2లో.

# రష్యాలో మరోసారి భారీ భూకంపం

జూలై31సమయజ్యోతి

రష్యా లో మరోసారి భారీ భూకంపం సంభవించింది. కురిల్ ఐలాండ్ లో గురువారం భూమి కంపించింది. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 6.5గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. నిన్న కమ్‌చట్కా ద్వీపకల్పంలో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. అదే ప్రాంతానికి 200 మైళ్ల దూరంలో తాజాగా ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస భూకంపాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

# సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం..

## న్యాయమూర్తికి కృతజ్ఞతలు : కేటీఆర్

హైదరాబాద్ : జూలై31సమయజ్యోతి



2లో.

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ అనర్హత పిటిషన్లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు.ఈ దేశం యొక్క ప్రజాస్వామ్య నిర్మాణం హానికరమైన పద్ధతుల ద్వారా క్షీణించకుండా చూసుకున్నందుకు గౌరవనీయ ప్రధాన న్యాయమూర్తికి మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. 2లో

# చైనాలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బంగారం షాపు

## నగల కోసం ప్రజలు వెతుకులాట

## నెట్టింట వైరల్‌గా మారిన దృశ్యాలు

బీజింగ్,జూలై31(సమయజ్యోతి):



చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీపడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. కొందరు ఈ పని కోసం వానలో తడుస్తూ వెతకడం మొదలు పెట్టారు. షాపు ముందు నుంచి కాలువలా వెల్లిన చోటల్లా వెతుకుతూ కనిపించారు. 2లో

# అధికారిక ఉత్తర్వులు లేకుండానే ఎఫ్ఆర్ఎస్ అమలుపై టీఎస్‌పీటీఏ ప్రశ్నలు

**- ఉపాధ్యాయుల కోసం మెరుగైన వసతులను డిమాండ్**



హైదరాబాద్, జూలై 31, 2025:సమయజ్యోతి

తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌పీటీఏ) రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల హాజరుకు ముఖ ఆధారిత గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) ను అధికారిక ఉత్తర్వులు లేకుండా అమలు చేయడానికి చేసిన ప్రయత్నాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ప్రచురణ మరియు ప్రసారం కోసం విడుదల చేసిన ప్రకటనలో, టీఎస్‌పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ, జిల్లా విద్యాధికారులకు (డీఈఓలు) మౌఖిక ఆదేశాల ద్వారా ఈ విధానం అమలు చేయడం అనైతికమని, లి"అసమర్థంగా మరియు గందరగోళంగా ఉన్న చర్య"లిగా పేర్కొన్నారు."అధికారిక ఉత్తర్వులు లేకుండా ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేయడం సరికాదు. ఉపాధ్యాయులకు స్పష్టత, నిబంధనలు అవసరం ు అయోమయం కాదు," అని షౌకత్ అలీ ప్రభుత్వాన్ని కోరారు.ఇంకా, పాఠశాల హాజరు పర్యవేక్షణ పద్ధతులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో, అదే స్థాయిలో పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రభుత్వం శ్రద్ధ చూపాలంటూ సంఘం డిమాండ్ చేసింది. "ఉపాధ్యాయులపై పర్యవేక్షణ తీవ్రంగా జరుగుతోంది, కానీ తరగతి గదుల పరిస్థితులేంటి?" అని ఆయన ప్రశ్నించారు.ఉపాధ్యాయులపై వస్తున్న అదనపు భారం విషయంలో, టీఎస్‌పీటీఏ ప్రతి పాఠశాలకూ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని కోరింది. ఇది అందుబాటులో లేకపోతే, ప్రతి ఉపాధ్యాయుడికి ఏడాదికి ?5,000 డేటా ఖర్చుల కోసం మంజూరు చేయాలనీ డిమాండ్ చేసింది.అలాగే, తెలంగాణ రాష్ట్రంలో అత్యంత కీలకమైన విద్యాశాఖకు ఇంకా మంత్రి లేకపోవడం దురదృష్టకరమని షౌకత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే విద్యాశాఖకు ప్రత్యేక మంత్రి నియమించకపోతే, విద్యావ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం పడతుందని హెచ్చరించారు.

మొదటిపేజీ తరువాయి

## చైనాలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బంగారం షాపు

షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీ-లో జులై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్రతీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు.అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకొచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు- దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతో పాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు- తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.12కోట్ల పైనే ఉంటుందని వెల్లడించారు. బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కేజీ బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇలా వెతుకుతున్న వారిని చూసి మరికొందరుకూడా రంగంలోకి దిగడం విశేషం.

## రోహింగ్యాలు చొరబాటుదారులా..శరణార్థులా?

### కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ,జూలై31(సమయజ్యోతి):

రోహింగ్యాల విషయమై కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆసక్తికర ప్రశ్నలు అడిగింది. రోహింగ్యాల విషయం లో దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు గురువారం విచారణ చేపట్టింది. రోహింగ్యాలను శరణా ర్థులుగా ప్రకటించేందుకు అర్హు లేనా? అని ప్రశ్నించిన సుప్రీం కోర్టు.. అసలు రోహింగ్యాలు చొరబాటు దారులో.. శరణార్థులో తేల్చాలని ఆదేశించింది. ఒకవేళ రోహింగ్యాలు చొరబాటుదారులైతే బహిష్కరిస్తున్నారా? అని కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. అంతేకాదు, రోహింగ్యాల బహిష్కరణకు కేంద్రం, రాష్ట్రాలు తీసుకున్న చర్యలేంటని కూడా అత్యున్నత న్యాయస్థానం కేంద్రాన్ని కోరింది.న్యాయమూర్తులు సూర్యకాంత్, దీపంకర్ దత్తా ఇంకా ఎన్.కోటీశ్వర్ సింగ్ లతో కూడిన బెంచ్ ఈ అంశంపై విచారణ జరిపింది. రోహింగ్యాలు చొరబాటుదారులో.. శరణార్థులో తేలాక ఇతర సమస్యలు, పర్యవసానాల గురించి మాట్లాడవచ్చని అభిప్రాయపడింది.

మొదటిపేజీ తరువాయి

## దేశ ప్రయోజనాలపై రాజీపడేది లేదు

ప్రభుత్వం రైతులు, చిన్న వ్యాపారులు, ఎంఎంఈలు వంటి వర్గాల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా భావిస్తోందని గోయల్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై అనూహ్యంగా భారీ టారిఫ్ బాంబు విసిరారు. భారత దిగుమతులపై ఏకంగా 25 శాతం సుంకాలు బాదారు. అంతేగాక వీటికి అదనంగా రష్యాతో వర్తకం చేస్తున్నందుకు భారత్‌పై ప్రత్యేకంగా జరిమానా కూడా విధించనున్నట్టు- పేర్కొన్నారు. ఆ మొత్తం ఎంతన్నది పేర్కొనలేదు. ఈ నిర్ణయాలు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ట్రూత్ సోషల్'లో బుధవారం ఈ మేరకు ఆయన పలు పోస్టులు పెట్టారు. అమెరికాతో భారత వర్తక విధానాలు, నిబంధనలను అత్యంత దారుణమైనవిగా అభివర్ణించారు. భారత్ మా మిత్ర దేశమే. కానీ వర్తక, వాణిజ్య సంబంధాల విషయంలో ఆ దేశంతో అంతా సజావుగా లేదు. అమెరికాపై ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. అందుకే ఆ దేశంతో మేం భారీ స్థాయిలో వ్యాపారం చేయడం లేదు'అని రాసుకొచ్చారు. భారత్‌తో అమెరికాకు భారీ వర్తక లోటు- ఉందని గుర్తు చేశారు. రష్యా నుంచి భారీగా చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకే అదనంగా జరిమానా విధిస్తున్నట్టు- స్పష్టం చేశారు. 'ఉక్రెయిన్‌లో జనహననం ఆగాలని ప్రపంచమంతా ఆకాంక్షిస్తోంది. ఇలాంటి సమయంలో అందుకు పాల్పడుతున్న రష్యాతో భారత్ భారీ వాణిజ్య సంబంధాలు నెరుపుతోంది'అంటూ ఆక్షేపించారు.

మొదటిపేజీ తరువాయి

## నలుగురు కొత్త జడ్జిల ప్రమాణం

### ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్

హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):

తెలంగాణ హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు ప్రమాణ స్వీకారం చేశారు. చీఫ్ జస్టిస్ వీరితో ప్రమాణం చేయించారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతో వారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న ఆమోదముద్రవేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది. మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి.

## ఆరు రాష్ట్రాల్లో ?11,169 కోట్ల విలువైన మల్టీట్రాక్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం

సమయజ్యోతి, న్యూఢిల్లీ, జూలై 31, 2025

- భారత రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో పెద్ద ప్రోత్సాహం లభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, జార?ండ్ రాష్ట్రాల్లోని 13 జిల్లాల పరిధిలో నాలుగు ప్రధాన మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులను ఆమోదించారు. ఈ ప్రాజెక్టులకు అంచనా వ్యయం ?11,169 కోట్లు కాగా, 2028%-%29 నాటికి పూర్తి చేయనున్నారు. మొత్తం 574 కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ విస్తరించనుంది.

### ఆమోదం పొందిన నాలుగు ప్రాజెక్టులు:

1. ఇటార్సీ-నాగ్‌పూర్ (4వ లైన్)
2. ఔరంగాబాద్ (ఛత్రపతి సంభాజీనగర్)-పర్భాని (డబులింగ్)
3. అలువాబాడీ రోడ్-న్యూ జల్పాయిగుడీ (3వ, 4వ లైన్లు)
4. డంగోపోసీ-జారోలీ (3వ, 4వ లైన్లు)

ఈ మల్టీట్రాక్ మార్గాల వల్ల రూట్ సామర్థ్యం గణనీయంగా పెరిగి, రద్దీ తగ్గుతుంది. ఇది రైల్వేలు నిర్వహించే సరకు మరియు ప్రయాణికుల రవాణా సామర్థ్యాన్ని మెరుగుపరిచే అవకాశాన్ని కలిగిస్తుంది. అధికారిక అంచనాల ప్రకారం, ఈ ప్రాజెక్టుల వల్ల 2.29 కోట్ల పని దినాల ప్రత్యక్ష ఉపాధి కలగనుంది, ఇది ప్రాంతీయాభివృద్ధికి తోడ్పడుతుంది.ఈ ప్రాజెక్టుల వల్ల 2,309 గ్రామాలకు పైగా కనెక్టివిటీ మెరుగవుతుంది, దాదాపు 43.6 లక్షల ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. బొగ్గు, సిమెంట్, క్లింకర్, ఫ్లై యాష్, జిప్సమ్, వ్యవసాయ ఉత్పత్తులు, కంటెయినర్లు, పెట్రోలియం ఉత్పత్తులు వంటి ముఖ్యమైన సరుకుల రవాణాకు ఈ మార్గాలు కీలకంగా మారనున్నాయి.ఈ కొత్త మార్గాల వల్ల ప్రతి సంవత్సరం అదనంగా 95.91 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరగగలదు. ఇవి పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద ప్రతిపాదించబడినవిగా, దేశం యొక్క మల్టీ-మోడల్ ట్రాన్స్పోర్ట్ వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఉన్నాయి.ఆర్థిక ప్రయోజనాలతో పాటు, పర్యావరణ పరిరక్షణలోనూ ఈ ప్రాజెక్టులు కీలకంగా నిలవనున్నాయి. రైల్వే ఆధారిత సరకు రవాణా పెరిగితే వార్షికంగా 16 కోట్ల లీటర్ల ఇంధనం ఆదా అవుతుంది, అలాగే 515 కోట్ల కిలోల కర్బన ఉద్గారాలు తగ్గుతాయి, ఇది సుమారు 20 కోట్ల మొక్కలను సంరక్షించినట్లే పర్యావరణ ప్రయోజనాన్ని కలిగిస్తుంది.ఈ ప్రాజెక్టులు దేశంలోని మౌలిక వనరుల అభివృద్ధికి బలాన్ని చేకూర్చడమే కాకుండా, సమగ్ర అభివృద్ధికి దోహదపడేలా తయారయ్యాయి.

మొదటిపేజీ తరువాయి

## ట్రంప్ టారిఫ్ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు

వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ప్రకటన సరికాదన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత వాణిజ్యానికి అమెరికా అతి పెద్ద మార్కెట్. మన ఎగుమతులే 87-90 బిలియన్ డాలర్ల వరకు ఉంటాయి. రష్యా నుంచి దిగుమతులు చేస్తున్నందుకు సుంకాలు, జరిమానా విధిస్తున్నట్లు- ట్రంప్ పేర్కొన్నారు. వాణిజ్య చర్చల్లో బేరసారాల కోసం ఇది హెచ్చరిక కావొచ్చు. టారిఫ్‌ల నేపథ్యంలో ఎగుమతులు తగ్గితే అది మనకు నష్టం కలుగుతుంది. ఇది మన జీడీపీపై కూడా ప్రభావం చూపించొచ్చు. అమెరికా డిమాండ్లు పూర్తిగా అర్థం లేనివిగా ఉన్నాయి. వాటిని ప్రతిఘటించే హక్కు భారత్‌కు ఉంది. వారిని సంతోషపెట్టడానికి మన జీవనోపాధిని పణంగా పెట్టలేం. మన అవసరాలను కూడా అగ్రరాజ్యం అర్థం చేసుకోవాలి' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ టారిఫ్‌ల విషయంలో మన దేశ విధానంపై నమ్మకం ఉందని థరూర్ పేర్కొన్నారు. తర్వాత ఏం జరుగుతుందనేది కొనసాగుతున్న చర్చలపై ఆధారపడి ఉంటు-ందన్నారు. అమెరికా ఒత్తిడికి లొంగి పోకుండా.. న్యూదిల్లీ జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రష్యాతో వాణిజ్యం కొనసాగిస్తుందనే కారణం చూపుతూ.. భారత దిగుమతులపై ట్రంప్ 25శాతం సుంకాలతో పాటు- పెనాల్టీలు విధించారు. ఆగస్టు 1 నుంచి ఇది అమల్లోకి రానున్నట్లు- తెలిపారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూదిల్లీ ఒకటని ఈ సందర్భంగా మళ్లీ ఆరోపించారు. ఈ క్రమంలోనే రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తమకు సంబంధం లేదని ఆయన మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారి ఆర్థికవ్యవస్థను మరింత పతనం చేసుకుంటు-న్నాయని వ్యాఖ్యానించారు.

మొదటిపేజీ తరువాయి

## సుప్రీం తీర్పుపై నిపుణులతో చర్చించి నిర్ణయం

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టీకరణ

హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):

ఫిరాయింపుల ఎమ్మెల్యేల వ్యవహారంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ స్పష్టం చేశారు. తనకు మూడు నెలల గడువు విధించడంపై న్యాయ నిపుణులతో చర్చించాకే తదుపరి నిర్ణయానికి వెళ్తామని అన్నారు. ఈ క్రమంలో ధన్‌ఖడ్ వ్యాఖ్యల ప్రస్తావన తెచ్చారు. సుప్రీంకోర్టు తీర్పు పై న్యాయ నిపుణులతో చర్చిస్తా. మాజీ ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్‌ఖడ్ ఏం మాట్లాడారో అందరూ చూశారు. వాటిని కూడా మేము పరిశీలిస్తున్నాం. గతంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చాం. సుప్రీంకోర్టు తీర్పును పరిశీలించాకే అన్ని వివరాలు త్వరలో చెప్తా అని అన్నారు. ఇదిలా ఉంటే.. పార్టీ మారిన పది మందిపై తొలుత తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో.. విచారణ షెడ్యూల్ కోసం సింగిల్ బెంచ్ జడ్జి తెలంగాణ స్పీకర్‌కు నాలుగు వారాల గడువు విధించారు. అయితే డివిజనల్ బెంజ్ దానిని కొట్టేసింది. ఇక ఇవాళ్టి తీర్పులో ఫిరాయింపులపై చర్యల విషయంలో స్పీకర్‌కు సుప్రీం కోర్టు మూడు నెలల కాలపరిమితి విధించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి, గవర్నర్‌లకు గడువు విధిస్తూ సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉప రాష్ట్రపతి హోదాలో ఓ కార్యక్రమానికి హాజరైన ధన్‌ఖడ్.. సుప్రీం కోర్టుపై తీవ్ర వ్యాఖ్యలే చేశారు. పార్లమెంటే సుప్రీం అని. ఎన్ని-కై-న ప్రజాప్రతినిధులే రాజ్యాంగ ప్రకారం అల్టిమేట్ మాస్టర్స్ అని అన్నారాయన. 'సుప్రీం కోర్టు రాష్ట్రపతికి గడువు విధించడం తగదు. ఇప్పుడు జడ్జీలు శాసనాలు చేస్తారు, కార్యనిర్వాహక విధులు నిర్వర్తిస్తారు, సూపర్ పార్లమెంటులా వ్యవహరిస్తారు' అని విమర్శించారు. న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్య శక్తులపై అణుక్షిపణి ప్రయోగించకూడదు అని తీవ్ర వ్యాఖ్య చేశారాయన. అయితే.. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలన్న పిటిషన్ విచారణ సమయంలో సుప్రీం కోర్టు పరోక్షంగా ధన్‌ఖడ్ వ్యాఖ్యలపై స్పందించింది. ఇప్పుడు మేమే కార్యనిర్వాహక వ్యవస్థలో జోక్యం చేస్తున్నామన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నాం. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రపతి పాలన విధించాలని రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వాలా? అంటూ ఆ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

మొదటిపేజీ తరువాయి

## విమానం గాల్లో ఉండగా భారీ కుదుపులు..

ఈ క్రమంలో వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న సమయంలో విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. ఈ ఘటనలో దాదాపు 25 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఇక పైలట్ విమానాన్ని మినియాపొలిస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అనంతరం గాయపడిన ప్రయాణికులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో విమానంలో 275 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనపై డెల్టా ఎయిర్‌లైన్స్ స్పందించింది. కుదుపులకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపింది.ఈ ఘటనతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

మొదటిపేజీ తరువాయి

## రష్యాలో మరోసారి భారీ భూకంపం

అయితే, తాజా భూకంపం కారణంగా ఎలాంటి సనామీ హెచ్చరికలూ జారీ కాలేదు.రష్యాలోని కమ్‌చట్కా ద్వీపకల్పం లో బుధవారం ఉదయం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే 4.4 అంతకంటే ఎక్కువ తీవ్రతతో 125 సార్లు భూమి కంపించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. వాటిలో మూడు 6.0 తీవ్రతకంటే ఎక్కువగా నమోదైనట్లు పేర్కొంది. రష్యాలో ఇంత తీవ్రతతో భూకంపం రావడం ఇదే మొదటిసారి.భూకంపం కారణంగా వచ్చిన సునామీ ప్రభావంతో కామ్‌చట్కా ఉపఖండంలోని నౌకాశ్రయాలతోపాటు జపాన్ తీరం, అమెరికాలోని హవాయి రాష్ట్ర తీరప్రాంతాలు సముద్రపు నీటిలో మునిగిపోయాయి. మూడు మీటర్ల కన్నా ఎత్తయిన అలలు వరుసగా దాడి చేశాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తీర ప్రాంత ప్రజలు ఎత్తయిన ప్రదేశాలవైపు పరుగులు తీయడంతో అనేక దేశాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. భూకంపం, సునామీ కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్టు ఎటువంటి సమాచారం వెలువడలేదు.

మొదటిపేజీ తరువాయి

## సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం..

### న్యాయమూర్తికి కృతజ్ఞతలు : కేటీఆర్

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాలను పటిష్టం చేయాలని, ఫిరాయింపులపై ఆటోమేటిక్ రద్దు చేయాలని తన పంచ న్యాయ్‌లో వాదించిన రాహుల్ గాంధీ ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని ఆశిస్తున్నాను. మిస్టర్ గాంధీ, మీ స్వంత ఉపదేశాలకు కట్టుబడి ఉండమని నేను మీకు చెబుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు.గౌరవనీయులైన స్పీకర్ పదవిని మీరు, మీ పార్టీ భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికి ఉపయోగించుకోరని నేను ఆశిస్తున్నాను. ఈ 10 మంది ఎమ్మెల్యేలు అక్రమంగా కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రతిరోజూ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని అంగీకరించడానికి పెద్దగా పరిశోధన అవసరం లేదు అని కేటీఆర్ తెలిపారు.

**లీగల్ టీమ్స్, బీఆర్ఎస్ సైనికులకు ధన్యవాదాలు**

కష్టకాలంలో మాకు అండగా నిలిచిన లీగల్ టీమ్స్, బీఆర్ఎస్ సైనికులకు ధన్యవాదాలు. నేను అర్థం చేసుకున్నట్లుగా, 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు మాకు మూడు నెలల సమయం ఉంది. పనిలోకి వెళదాం బాయ్స్! అని కేటీఆర్ పిలుపునిచ్చారు. సత్యమేవ జయతే.. జై కేసీఆర్! జై తెలంగాణ! అని కేటీఆర్ నినదించారు.

# రేషన్ కార్డులను పంపిణీ చేసిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.

ఆత్మకూరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో కొత్తగా మంజూరు అయిన రేషన్ కార్డులను లబ్ధిదారులకు రాష్ట్ర పాడి, పరిశ్రమ, మత్స్య క్రీడల శాఖ మంత్రి డాక్టర్ శ్రీహరి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం గత 10 ఏళ్లుగా ఒక్క రేషన్ కార్డు కూడా పంపిణీ చేయలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతరం కొనసాగుతుందని అన్నారు.కొత్తగా రేషన్ కార్డును అందుకున్న వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# నిబంధనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహిస్తే సీజ్ చేస్తాం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం ఉత్సవాల సందర్భంగా బాల్కొండ మండలంలో డీజే లకు ఎలాంటి అనుమతి లేదని, అక్రమంగా ఎవరైనా వినియోగిస్తే సీజ్ చేస్తామని ఠాణా లో ఎస్సై శైలేందర్ పేర్కొన్నారు. ఆయన డీజే నిర్వాహకులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించవద్దని హెచ్చరించారు



# గ్రామపంచాయతీ కార్యాలయంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

మండలంలోని అందుగులపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో కొత్త రేషన్ కార్డు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మందమర్రి మండలం ఇన్చార్జి కడారి జీవన్ కుమార్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్, కెసిఆర్ ప్రభుత్వం 9 సంవత్సరాల కాలంలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇచ్చిన దాఖలు లేవని, కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చక రేషన్ కార్డులు ఇస్తుందని తెలిపారు. కార్డులు ఇవ్వడం వల్ల బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆసరా అవుతుందని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీ రైతులకు 2 లక్షల రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు, ఉచిత బస్సు సౌకర్యం, 500 గ్యాస్ సిలిండర్, రైతు భరోసా హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వీరేందర్, నాయకులు బైరనేని లక్ష్మణ్, కరోబారి మధుకర్, డీలర్ వెంకటరెడ్డి లబ్ధిదారులు పాల్గొన్నారు.



# సీసీటీవీ ఏర్పాటు చేసుకోవాలి: ఎస్సై

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలం కిసాన్ నగర్ శివారులో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ దొంగతనం నేపథ్యంలో ట్రాన్స్ఫార్మర్ దగ్గర సీసీటీవీ ఏర్పాటు చేసుకోవాలని, దొంగతనాలు నివారించడంలో ఉపయుక్తంగా ఉంటుందని గురువారం ఎస్సై శైలేందర్, రైతులకు సూచనలు చేశారు.



# ఆత్మకూరు మార్కెట్ ని అభివృద్ధి చేస్తాను మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి

ఆత్మకూరు వనపర్తి జిల్లా.



ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎం.డి. రహమతుల్లా, వైస్ చైర్మన్ నర్వ కృష్ణారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ గా టి. రవి కాంత్, టి. రాజు, డి. మోహన్, పి. విష్ణు, ఎస్. శ్యామ్, కామలాకర్ గౌడ్, రాజు, డి. గోవర్ధన్, అరవింద్ రెడ్డి, మన్యమ్మ, నరేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఉద్దేశించి రాష్ట్ర పాడి పరిశ్రమల, మత్స్య క్రీడల శాఖ మంత్రి డాక్టర్ శ్రీహరి, భారత్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డు లో రైతులకు ఏ సమస్యలు తలెత్తకుండా వారికి నిరంతరం సేవలు అందించాలని అన్నారు. మార్కెట్ చైర్మన్ వైస్ చైర్మన్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన పాలక సభ్యులు నిన్నటి వరకు ఒక లెక్క నేటి నుంచి ఒక లెక్క అన్నారు. ఈరోజు నుండి బాధ్యత ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మీరు చేసిన సేవలు గుర్తించి ఇచ్చిన పదవి అన్నారు. ఈ ప్రాంతం వ్యవసాయ ఆధారత ప్రాంతమని అన్నారు. ఈ ప్రాంతంలో ఉండే రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వారి యొక్క సంక్షేమం, వారి అభివృద్ధి కోసం నిరంతర కృషి చేయాలని అన్నారు. మార్కెట్ అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తానని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పగటి కలలు కంటుందని అన్నారు. మూడున్నర ఏళ్ల తర్వాత మేమే అధికారులకు వస్తున్నామని కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు ఉందని అన్నారు. వారం మూడున్నర ఏళు కాదు 30 ఏళ్ల అయినా అధికారులకు రారని అన్నారు. జూరాల ప్రాజెక్టు, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు లాను కట్టింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. జూరాల ప్రాజెక్టు గేట్లు లూజ్ అయితే ప్రాజెక్టుపై బిఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాలకు తెర లేపారని అన్నారు.లక్ష క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉంటే ప్రాజెక్టు కెపాసిటీ సరిపోతలేదని అనడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. ప్రాజెక్టులో 12 లక్షల క్యూసెక్కుల నీరును నిలువ చేసుకున్న ప్రాజెక్టుకు ఎలాంటి ముప్పు లేదని అధికారులు వెల్లడించారని అన్నారు. మీ మాదిరిగా కాలేశ్వరం ప్రాజెక్టు కాదు కట్టింది. కూలిపోవడానికి అని మంత్రి ఎద్దేవ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించుకుందాం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు.తొలి సారిగా మైనార్టీ కి చైర్మన్ గా ఎం. డి. రహిమతుల్లాకు అవకాశం. మార్కెట్ యార్డు ఏర్పడినప్పటి నుండి నేటి వరకు ముస్లిం మైనార్టీలకు గత పాలకులు అవకాశం కల్పించలేదు. మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానిక మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముదిరాజ్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో అయన పెద్ద మనసుతో ఎం. డి.రహిమతుల్లా కు చైర్మన్ పదవి కట్టబెట్టి ఆయన సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. భావద్వేగానికి లోనైన ఎండి రహమతుల్లా. మా నాన్న ఎండి ఉస్మాన్ కాంగ్రెస్ పార్టీ కోసం తన చివరి శ్వాస వరకు కంకణ భక్తుడై పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని నేడు మా నాన్న మా కళ్ళ ముందు లేకపోక పోవడం మా కుటుంబానికి చాలా బాధాకరమని భావద్వేగానికి లోనయ్యారు.మా నాన్న అకాల మరణంతో మా కుటుంబం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నపుడు శ్రీ రాజ రాంభూపాల్ అమ్మాపురం సంస్థాన దిశు లు మమ్ములను ఆదరించి ఆదుకున్నాడని అన్నారు. చైర్మన్ పదవి పోటీ పడిన వారిలో నేను చిన్న వయసు వాడిని. మార్కెట్ చైర్మన్ పదవి కోసం నాకంటే వయసులో పెద్దవారు పదవిని ఆశించినప్పటికీ మంత్రి డాక్టర్ శ్రీహరి అందరికీ నచ్చచెప్పి ఒప్పించి నన్ను మార్కెట్ చైర్మన్ గా చేశారని అన్నారు. మంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కల్లుగీత రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అబేదుల్లా కొత్వాల్, డిసిసిబి చైర్మన్ మావిళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి, అమ్మపురం సంస్థాన దీశు లు శ్రీ రాజ శ్రీ రాంభూపాల్, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయచూరు పరమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తులసిరాజు యాదవ్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు, అమరచింత మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్, మాజీ ఎంపీటిసి అయూబ్ ఖాన్, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ తో పాటు వివిధ గ్రామాల రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణానికి చెందిన హుమైరా షబ్నంకు వృక్షశాస్త్రంలో పిహెచ్‌డి ప్రదానం

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :



ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని వృక్షశాస్త్ర విభాగంలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఎండీ షఫియుల్లా కుమార్తె హుమైరా షబ్నం ఇటీవల పిహెచ్‌డి (పిహెచ్‌డి) డిగ్రీని సాధించింది. హుమైరా కష్టపడి చదివే తెలివైన ప్రతివావంతురాలు.ఆమె సాధించిన ఈ అసాధారణ విద్యా సాధన పర్యావరణ శాస్త్రం మరియు జీవ పరిశోధన రంగంలో ఒక ప్రధాన మైలురాయి.హుమైరా షబ్నం "హైదరాబాద్ సెంట్రల్ జోన్‌లోని దక్కన్ పార్క్ యొక్క ఏరోబయోలాజికల్ స్టడీస్" అనే పిహెచ్‌డి పరిశోధన థీసిస్‌ను పూర్తి చేసింది,దీనిలో ఆమె హైదరాబాద్ సెంట్రల్ జోన్‌లో ఉన్న దక్కన్ పార్క్‌లో ఉన్న పుప్పొడి ధాన్యాలు,శిలీంధ్ర బీజాంశాలు మరియు ఇతర సూక్ష్మ కణాలు వంటి వాయుమార్గ జీవ కణాల వాతావరణ మరియు జీవ విశ్లేషణను సమర్పించింది.ఈ కణాలు వివిధ సీజన్లలో మానవ ఆరోగ్యాన్ని,ముఖ్యంగా శ్వాసకోశ వ్యాధులను ఎలా ప్రభావితం చేస్తాయో ఆమె పరిశోధన చూపించింది.ఈ పరిశోధన పని ప్రముఖ వృక్షశాస్త్రజ్ఞుడు డాక్టర్ పి.ఛాయా పర్యవేక్షణలో పూర్తయింది. ఆయన శాస్త్రీయ మార్గదర్శకత్వం మరియు పరిశోధన నాయకత్వం ఈ విజయంలో కీలక పాత్ర పోషించింది.హుమైరా షబ్నం వైవా వోస్ జూలై 14, 2025న విజయవంతంగా జరిగింది.ఆ తర్వాత ఆమెకు రెగ్యులర్ డాక్టరేట్ డిగ్రీ ప్రధానం చేయబడింది.ఈ సంతోషకరమైన సందర్భంలో కుటుంబ సభ్యులు,బంధువులు,నగరంలోని ప్రముఖ వ్యక్తులు,మత ఉలేమాలు,రాజకీయ నాయకులు మరియు విద్యావేత్తలు హుమైరా షబ్నంను అభినందించారు.ఆమె బంగారు భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు.ముఖ్యంగా ప్రఖ్యాత విద్యావేత్త శ్రీ షాహిద్ అలీ హస్రత్ మరియు ప్రముఖ పండితుడు డాక్టర్ ఎస్.ఎం. ఫసిఉల్లాహ్ ఈ విజయాన్ని కొత్త తరం మహిళా విద్యార్థులకు వెలుగు దీపంగా అభివర్ణించారు.ఈ సందర్భంగా ముస్లిం మత ఉలేమాలు దేశ కుమార్తెలు ప్రతి విద్యా రంగంలోనూ ముందుకు సాగాలని మరియు దేశానికి కీర్తిని తీసుకురావాలని ప్రార్థించారు.హుమైరా ఆదిలాబాద్‌లోని విద్యావంతులైన,సంప్రదాయ నైతిక కుటుంబానికి చెందినవారు.ఆమె తండ్రి శ్రీ ఎండి షఫియుల్లాహ్,ఆమె విద్య,పరిశోధన ప్రతి దశలోనూ ఆమెకు పూర్తి మార్గదర్శకత్వం మరియు మద్దతును అందించారు.ఆమె కుటుంబం,ఉపాధ్యాయులు,తోటి పరిశోధకులు మరియు స్నేహితులు ఈ విజయం పట్ల ఆనందం,గర్వాన్ని వ్యక్తం చేశారు.ఈ విజయం ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులకే కాకుండా తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు,ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులకు కూడా ప్రోత్సాహకరమైన ఉదాహరణ అని ఇది జ్ఞానం,అంకితభావం మరియు కృషి ద్వారా ముస్లిం మహిళలు శాస్త్రీయ పరిశోధన మరియు విద్యా రంగంలో కూడా అద్భుతమైన సేవలను అందించగలరని తెలియజేస్తుందన్నారు.

# చించోలి.బి శివారులో జిల్లా కోర్టు భవనానికి భూమి కేటాయింపు

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 31.

జిల్లా కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అధికారులు కేటాయించారు. సారంగాపూర్ మండలంలోని చించోలి.బి గ్రామ శివారులో 6.32 ఎకరాల భూమిని కోర్టు భవన నిర్మాణానికి కేటాయించారు. గురువారం ఈ స్థలాన్ని రెవెన్యూ, న్యాయ శాఖాధికారులు కలిసి పరిశీలించారు. ఈ పరిశీలనలో డిఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, ఆర్డీఓ రత్నాకళ్యాణి, తహసిల్దార్ శ్రీదేవి, ఇతర న్యాయ, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.




GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332

సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# ప్రధాన సమస్యలపైనా చర్చలు ఏవీ ?

పార్లమెంటులో ఎంపిలకు ప్రజల సమస్యలు పట్టడంలేదు. ఆపరేషన్ సిందూర్‌పై ఎట్టకేలకు చర్చ సాగింది. దీనిపైనా ఈకలు పీకాలని చూశారు. దేశ సార్వభౌమత్వానికి, దేశ ఆత్మగౌరవానికి సంబంధించిన విషయాల్లో కూడా విపక్షాలు ఐక్యత ప్రద్శించలేక పోయారు. అన్నింటికి మించి సిందూర్ పేరు పెట్టడంపై జయాబచ్చన్ అభ్యంతరం తెలపడం ఆమె అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. పేరు ఏది పెట్టాలి.... ఉగ్రవాదులను ఎప్పుడు చంపాలి... ఉగ్రవాదులు పాక్‌కు చెందిన వారేనా...కాశ్మీర్‌లోకి వారెలా వచ్చారు... ఎందుకు యుద్ధం ఆపారు.. వంటి సమస్యలు తప్ప ఉగ్రమూకలను ఉసిగొల్పిన పాక్‌ను పీచమణిచామా లేదా అన్నది ఎవ్వరూ మాట్లాడలేదు. ఏం మాట్లాడితే రాజకీయంగా లబ్ధి కలుగుతుందో అదే మాట్లాడాలని విపక్ష సభ్యులు నిర్ణయించారు. వారు కాలం గడిపితే చాలని అధికార బిజెపి పక్షం కూడా ఆశిస్తోంది. అసలు సమస్యలు ప్రస్తావించడం బిజెపికి కూడా ఇష్టం లేదు. బీహార్ ఓట్ల సవరణ కూడా ఇలాంటిదే. దీనిపై రచ్చ చేయడం ద్వారా లబ్ధిపొందాలన్న లక్ష్యం తప్ప ప్రజలపై వీరికి ప్రేమ లేదు. ప్రజలు ఏమైతే మాకేంటన్న ధోరణితో మన ఎంపిలు పార్లమెంటును ఉపయోగించుకుంటున్నారు. ధర్మస్థలిలో ఆక్రందనలు వినిపించడం లేదు. అక్కడ అధికారంలో కాంగ్రెస్ న్యాయబద్ధమైన తక్షణ విచారణకు పూనుకోలేదు. కేవలం సిట్ వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీనిని అత్యవసర కేసుగా గుర్తించి, అక్కడ నిజంగానే అమ్మాయిలన మానప్రాణాలు పోయాయా అని తర్కించడం లేదు. మహిళా ఎంపిలకు కూడా ధర్మస్థలి గురించి చర్చించాలన్న ఆలోచన రాకపోవడం దుర్మార్గం. సిందూర్ పేరెందుకు పెట్టారన్న జయాబచ్చన్ కనీసం ధర్మస్థలి ఘోరాలపై దృష్టి పెట్టివుంటే ఆమెను అభివనందించేవారు. ఇకపోతే పార్లమెంటులో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క సమస్య చర్చకు రావడం లేదు. ప్రజలు ఉద్యోగాలు లేక, ఉపాధి లేక నానా అవస్థలు పడుతున్నారు. దీనిని ఎలా అధిగమిద్దామనే విషయంలో చర్చ లేదు. ఒక్కొక్క ఎంపి లక్షల్లో జీత భత్యాలు తీసుకుంటున్నారు. వారికి ప్రజల ఈతిబాధలు పట్టడం లేదు. ఎందుకంటే.. ఇటీవలి కాలంలో సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పలు ప్రముఖ కంపెనీలు రాత్రికిరాత్రే ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. వీరంతా రోడ్డున పడుతున్నారు. కేవలం ఖర్చులు తగ్గించుకునే క్రమంలో ఇలా చేస్తున్నారు. వీరి ఉద్యోగాలు పోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉద్యోగభద్రత లేకుండా చేస్తున్న కంనెనీలపై చర్యలు లేవు. కోటి ఆశలతో ఐటి రంగాన్ని ఎంచుకున్న యువతరంలో కలవరాన్ని సృష్టిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అంటే భవిష్యత్తుకు ఎటువంటి ఢోకా లేదన్న ఒకప్పటి పరిస్థితి ఇప్పుడు మారిపోతోంది. ఏ రోజు ఉద్యోగం ఉంటుందో, ఏ రోజు ఊడుతుందో తెలియని దుస్థితి నెలకొంది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్),ఇన్ఫోసిస్ లాంటి సంస్థలు ఎడాపెడా ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. టిసిఎస్ తన ఉద్యోగుల్లో రెండు శాతం మందిని తొలగిస్తున్నట్లు- కొద్దిరోజుల క్రితం ప్రకటన చేసింది. టిసిఎస్ ఒక్కటే 12 వేల మందిని ఇంటికి పంపనుందని సమాచారం. పిడుగుపాటు లాంటి ఈ ప్రకటనతో టిసిఎస్ ఉద్యోగుల్లో కలకలం రేగింది. ఒక్క టిసిఎస్సే కాదు, ఇన్ఫోసిస్, హెచ్‌సిఎల్, విప్రోల వంటి సంస్థలదీ ఇదే బాట. ఉద్యోగులను తొలగించడంలో ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ఇలా ఉద్యోగాలు కోల్పోతున్న వారిలో మిడ్‌లెవల్, సీనియర్ మేనేజర్లే అత్యధికులు. మన దేశంలో కొంతకాలంగా టెక్‌రంగం ఒత్తిడిలో కొనసాగుతోంది. సంస్థలు నష్టాల్లో లేనప్పటికీ, గతంతో పోలిస్తే లాభాలు ఆశించినట్లు లేవని చెబుతున్నారు. ఫలితంగా ఐటి సేవల్లో మందగమనం చోటుచేసుకుందన్న అభిప్రాయం వ్యక్తమవు తోంది. గ్లోబల్ క్లయింట్లకు తక్కువ ఖర్చుతో సేవలందించడమన్నది భారత టెకీ రంగం ప్రధాన వ్యూహంగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే.సాఫ్ట్‌వేర్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ పరిణామాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ముఖ్యంగా 40 అంతకన్నా ఎక్కువ వయసున్న వారు ఉద్యోగాలను కోల్పోతే తిరిగి సంపాదించుకోవడం చాలా కష్టంగా మారుతోంది. చేస్తున్న ఉద్యోగాలపై ఉన్న నమ్మకంతో చేసిన అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న దుస్థితి అక్కడక్కడా కనపడుతోంది. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కొన్ని సంస్థలు ఉద్యోగులపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచుతున్నాయి. అనధికారికంగా పనిగంటలు పెంచడం, పని ఇవ్వకుండా బెంచ్‌పై ఉంచి బెదిరింపులకు పాల్పడటం వంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీంతో తీవ్ర అభద్రతా భావం సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో చోటుచేసుకుంటోంది. మరోవైపు ఈ రంగంలో తగ్గుతున్న ఉద్యోగాల ప్రభావం హైదరాబాద్, బెంగళూరు వంటి చోట్ల అనుబంధ రంగాలపై కూడా పడుతున్నట్లు- పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! కంపెనీల లాభనష్టాల లెక్కలు ఎలా ఉన్నప్పటికీ కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. విధి నిర్వహణకు అవసరమైన నైపుణ్యాల పెంపు బాధ్యతను సంస్థలే స్వీకరించాలి. ఆ సాకుతో ఉద్యోగాలను తొలగించడం మానుకోవాలి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ బతుకులలో పెరుగుతున్న సంక్షోభంపై ఉద్యమించాల్సి ఉంది. దేశీయ సంస్థలే కాదు, గ్లోబల్ టెక్ కంపెనీగా అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ కూడా భారీ సంఖ్యలో ఉద్యోగులపై వేటు వేస్తోంది. ఈ ఏడాదిలోనే ఆ సంస్థ 15వేల మంది ఉద్యోగులను ఇళ్లకు పంపింది. మే నెలలో ఆరువేల మందిని, జులైలో 9వేల మందిని ఆ సంస్థ తొలగించినట్లు అందుబాటులో ఉన్న గణాంకాలు చెబుతున్నాయి. మైక్రోసాఫ్ట్ మొత్తం ఉద్యోగుల్లో ఇది నాలుగు శాతం! క్లౌడ్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ ఉద్యోగులను ఆ సంస్థ తొలగిస్తోంది. వాల్‌స్ట్రీట్ జర్నల్ అధ్యయనం ప్రకారం ఈ ఏడాది జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 61వేల మందికిపైగా టెక్ రంగంలో ఉద్యోగాలు కోల్పోయారు. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ తదితర అంతర్జాతీయ సంస్థల ఉద్యోగులు ఈ జాబితాలో ఉన్నారు. 2019 తరువాత నుండి ఎంట్రీ లెవల్ ఉద్యోగుల నియామకం దాదాపు సగానికి పైగా తగ్గిపోయింది. రానున్న రోజుల్లోనూ ఈ పరిణామం కొనసాగనుంది. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం రోజురోజుకి పెరుగుతుండటంతో సాధారణ కోడింగ్, టెస్టింగ్ వంటి ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయి. 'ఎఐ ఫస్ట్' సంస్కరణల్లో భాగంగా ఈ పరిణామాలు చోటుచేసుకుం టున్నాయంటూ సత్య నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గమనార్హం. భారీ లాభాలు వస్తున్నప్పటికి ఉద్యోగులపై వేటు- వేయడాన్ని మైక్రోసాఫ్ట్ కొనసాగిస్తోంది. దీనికి ఎప్పటికప్పుడు ఏదో ఒక కారణాలను చెబుతూ తప్పించుకుంటున్నాయి. వీటిపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం కూడా కారణంగా చూడాలి. ఈ సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావించాల్సి ఉంది. ప్రభుత్వం కూడా సమాధానం ఇవ్వాల్సి ఉంది.



సమయజ్యోతి ప్రత్యేకం తెలుగు దినపత్రిక

# సృష్టిలోకల్తీలేనివి అమ్మ పాలుమాత్రమే.”
# (అమ్మ పాలు అమృతం.).

(ఆగస్టు 1 న ప్రపంచ తల్లి పాల దినోత్సవం సందర్భంగా) పిల్లలకు పాలు ఇచ్చే వారిని స్తన్య జీవులు అంటారు.ఇలాంటి వాటికి వెన్నెముఖ వుంటుంది.మనిషి కూడ ఇలాంటి వాడే.ప్రతి సంవత్సరం ఆగస్ట్ 1 న ప్రపంచ తల్లి పాల దినోత్సవం నిర్వహించడం ఆనవాయితి గా వస్తూ వుంది.సృష్టి లో జరిగే ప్రతిదీ పరస్పర ఆధారితం గా జరుగుతూ వుంది.పురుడు వచ్చే సమయానికి తల్లి పాలు ఉత్పత్తి కావడం,అప్పుడే పుట్టిన బిడ్డకి ఏమి తెలియక పోయినా,పీల్చె ఒక్క విధ్య మాత్రం తెలవడం,బిడ్డ పాలు తాగగానే తల్లికి తేలికగా అనిపించడం సృష్టి ధర్మం.బిడ్డకి పాలు ఇస్తే తల్లి అందం ఆవిరి అవుతూ వుందనే మూర?త్వం వల్ల అమృత తుల్యమయిన తల్లి పాలను బిడ్డకి దూరం చేస్తూ వున్నారు నేటి తరం కొంత మంది తల్లులు.ఆగస్టు మొదటి వారం తల్లి పాల వారం ని పురస్కరించుకుని తల్లి పాల ప్రాధాన్యత ని,ఐ.సి.డి.యస్ శాఖ ఆయా,గ్రామాలు,పట్టణాలలో అంగన్వాడీ టీచర్,ఆయాల ద్వార విస్తృత ప్రచారం నిర్వహిస్తారు.ఇంటింటికి తిరిగి వాని గొప్పతనం తెలియ చేస్తారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం అంతరించిపోతున్న తల్లి పాల సంస్కృతి వల్ల ఏటా వివిధ రోగాలతో ప్రపంచ వ్యాప్తంగా 20 లక్షల మంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారని సర్వేలు తెలియజేస్తున్నాయి. ఈ మార్పునకు ప్రధాన కారణం పారిశ్రామికీకరణ. ఈ దశలో ఎక్కువ మంది మహిళలు ఉద్యోగాలలో చేరడం, ఆ సమయంలో తమ పిల్లలకు పాలు పట్టే సమయం సరిపోయేది కాదు.వారు పిల్లలకు పాలు పట్టడం వల్ల సమయం వృధా అవుతూ వుందని పరిశ్రమల యాజమన్యములు భావించాయి.ఇందువల్లె తల్లి పాలకు ప్రత్యామ్నాయముగ పాల పొడులు,పాల సీసాలు కనిపెట్టినారు.వీని ఉత్పత్తి బహుళ జాతి కంపెనీల కి వెళ్ళినధి.వీరు వివిధ రకాల వ్యాపార ప్రకటనల తో తమ వ్యాపారం ని పెంచుకుని కోట్లు గడిస్తున్నన్నారు. లితల్లి పాల ప్రాధాన్యత,ఉపయోగాలను తెలుసుకుందాం.

1. అలర్జీలు రాకుండా నిరోధించడానికి ముర్రుపాలు తోడ్పడతాయి.
2.ముర్రుపాలలో శిశువుకు కావలసిన అన్ని పోషకవిలువలు బిడ్డ శరీరానికి అందుతాయి.
3. బిడ్డకు మొదట వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తుంది.
4. శిశువులకు ప్రకృతి ప్రసాదించిన సహజ అత్యుత్తమమైన పౌష్టికాహారం.
5. బిడ్డ సులువుగా జీర్ణమౌతాయి.
6. ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంటాయి.
7. తల్లిపాలవలన మలవిసర్జన సులభంగా జరుగుతుంది.
8. శిశువులకు దృష్టిలోపం రాకుండా నివారించడానికి దోహదపడతాయి.
9. తల్లికీ, బిడ్డకు చక్కని అనుబంధం ఏర్పడుతుంది.
10. వ్యాధుల బారి నుండి తల్లిపాలు రక్షిస్తుంది.
11. బిడ్డకు ప్రుతివరం కొనవలసిన అవసరంలేదు.
12. తల్లిపాలు సురక్షితమైనవి రోజులో 24 గంటలూ తల్లిపాలు లభిస్తాయి.
13. తల్లిపాలలో శిశువులకు కావలసిన అన్ని పోషక పదార్థాలన్నీ పూర్తి మోతాదులో ఉంటాయి.
14. శిశువునకు కావలసిన ఉష్ణోగ్రతలో ఉంటాయి.
15. బిడ్డ కోరుకున్న ప్రతిసారి పగలైనా, రాత్రైనా తల్లిపాలు పట్టాలి. బిడ్డ ఎంతసేపు పాలు త్రాగుతుంటేఅంతసేపు తాగిస్తుండాలి.
16. తల్లిపాలు తాగే పిల్లలు ఆకస్మిక మరణానికి గురయ్యే అవకాశం (సడన్ ఇన్ ఫాంట్ డెత్ సింద్రోం) తక్కువని కొన్ని పరిశోధనల్లో వెల్లడైంది.
17. తల్లిపాల వలన పోషకాహార లోపాలు తగ్గి 13 శాతం శిశు మరణాలరేటు తగ్గించవచ్చు. (మనదేశం, రాష్ట్రంలోనే శిశుమరణాలు అధికం)
18. శిశువులు అనారోగ్యంగా ఉన్నా తల్లిపాలు పట్టాలి.
19.మండువేసవిలోనైనా శిశువుకు ఎలాంటి నీరు పట్టనవసరం లేదు. ఎందుకంటే తల్లిపాలలో 90 శాతం నీరు ఉంటుంది. తల్లిపాలు త్రాగే శిశువులకు తల్లి పాల నుండి తగినంత నీరు లభిస్తుంది.
20. శస్త్రచికిత్స ద్వారా పుట్టిన పిల్లలకు కూడా వెంటనే తల్లిపాలు పరిశుభ్రమైన గిన్నెలో పిండి చెంచాతో లేదా ఉగ్గుగిన్నెతో పట్టించాలి.
21. శిశువుకు తల్లిపాలు ఇచ్చే టప్పుడు సరైన రీతిలో ఇవ్వాలి.
22. ఉద్యోగినులైతే శిశువుకి కనీసం నాలుగు గంటకొకసారి పాలివ్వాలి.
23. బిడ్డల్ని వదిలి కూలి పనికి వెళ్లే తల్లులు తమ పాలను ఒక పరిశుభ్రమైన గ్లాసులో పిండి 8 గంటలలోగా ఆపాలను శిశువులకు చెంచాతోగానీ లేదా ఉగ్గుగిన్నెతోకాని పట్టవచ్చును.
24. తల్లిబిడ్డకు పాలివ్వడం వలన మొదటి 6నెలలలోపు అండం విడుదల కానందున గర్భం దాల్చే అవకాశం లేదు. తల్లికి సహజ కుటుంబ నియంత్రణ పద్ధతిగా ఉపయోగపడుతుంది. ఈ పద్ధతినే “లాక్టేషనల్ ఎమోనోరియా లేదా లామ్’ అని అంటారు.
25. పిల్లలకు పాలిచ్చే తల్లులు వైద్యుల సలహా లేకుండా ఎలాంటి మందులు వాడరాదు.
26. ఒక తల్లి మరో బిడ్డకు అత్యవసరమైన సమయాలలో పాలు పట్టించవచ్చును.
27. దీర్ఘకాల వ్యాధులు ఉన్న తల్లులు వైద్యులు సలహామేరకు శిశువులకు పాలివ్వాలి.
28. హెచ్.ఐ.వి. ఇన్‌ఫెక్షన్ ఉన్న తల్లులు పోతపాలు సురక్షితంగా ఇవ్వలేనప్పుడు కేవలం తమ పాలను 6నెలల వరకు శిశువులకు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరం. ఎట్టి పరిస్థితులోనూ కలగలుపు (మిక్స్‌డ్) ఫీడింగు ఇవ్వకూడదు. ఏదో ఒక్కపాలుమాత్రమే ఇవ్వాలి.
29. ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు ప్రకారం శిశువుల గరిష్ఠ పెరుగుదలను మానసికాభివృద్ధిని ఆరోగ్యాన్ని సాధించాలంటే వారికి మొదట 6 నెలలపాటు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలి.
30. కేవలం తల్లిపాలను మాత్రమే తాగించడం శిశువు జీవితానికి శుభారంభం పలుకుతుంది. అవి వారిని చురుగ్గా చేసిబీ మేథా ప్రతిభను పెంచుతుంది.తల్లిపాలవల్ల శిశువుకే కాదు...తల్లికి కూడా అనేక లాభాలు ఉన్నాయి. కొన్ని రకాల (ఉదాహరణకు : రొమ్ము గర్భసంచి, అండాశయం మొదలగు క్యాన్సర్లు) క్యాన్సర్లు తక్కువగా వస్తాయని, అధ్యయనాలు చెబుతున్నాయి. తల్లిపాల సంస్కృతి ఒక సామాజిక బాధ్యత. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించి తల్లిపాల సంస్కృతిని పెంపొందించుకోవాలి.మనకు అంతగా తెలియనిది ఇటీవలే బెంగాల్‌లో రూపుదిద్దుకున్నది...విదేశాలలో విస్తారంగా ఉన్నది అమ్మపాల బ్యాంక్ దాన్నే మదర్ మిల్క్ బ్యాంక్ అనీ, బ్రెస్ట్ మిల్క్ బ్యాంక్ అని పిలుస్తున్నారు. ఈ బ్యాంకులో దాచే పాలు 6 నెలలున్నా పాడవకుండా భద్రంగా ఉంటాయి. తల్లిపాలు చాలని పిల్లలకు, పాలే పడని తల్లులకు ఈ బ్యాం క్ వరంలా మారి అనేక మందిని ఆకర్షిస్తోంది. అవసరంలో ఉన్న పిల్లలకు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎంత కావాలంటే అంత, ఎక్కడికి తేవాలంటే అక్కడికి క్షణాలలో చేర్చే వ్యవస్థగా ఈ మిల్క్ బ్యాంకలు... తయారై ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. అమెరికాలోనే 25 మిల్క్ బ్యాంకులు, ఉన్నాయంటే ఇవి పొందుతున్న జనాదరణ ఎంతటిదో ఆలోచించుకోవచ్చు. అమ్మకు పాలు పడక పోయినా, పడ్డపాలు చాలకపోయినా, బిడ్డపుట్టగానే అమ్మ పోయినా పోతపాలు అవసరమవుతాయి.తల్లులారా..మీ పిల్లలకు మీ పాలు తాగించండి.శిశువు ఎదుగుదలకి చేయూత నివ్వండి.తల్లి పాల ఉపయోగాలు తెలుసుకొండి.

కామిడి సతీశ్ రెడ్డి జయశంకర్
భూపాలపల్లి జిల్లా
(ఆగస్ట్ 1 న ప్రపంచ తల్లి పాల దినోత్సవం సందర్భంగా
)9848445134. తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

## రైతులతో వ్యవసాయాధికారులు,బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ రాజార్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని కలెక్టర్ కార్యాలయంలో గురువారం నార్నూర్ మండల రైతులతో,వ్యవసాయ అధికారులు,బ్యాంకర్లతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా తన సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా నార్నూర్ మండల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ సమీక్షించారు.రైతులకు బ్యాంకింగ్ సౌకర్యాలను సులభంగా అందుబాటులో ఉంచడం గురించి చర్చించారు.ఆర్థిక స్థాయి ప్రకారం పంట రుణ మంజూరు,ఆగస్టు మొదటి వారంలోపు పంట రుణాలను సకాలంలో పునరుద్ధరించడం,పంట రుణాల చెల్లింపు కోసం రైతుభరోసా మొత్తాన్ని సర్దుబాటు చేయకపోవడం,రైతులు వడ్డీ వ్యాపారుల నుండి కాకుండా అధికారిక సంస్థల నుండి రుణాలు తీసుకునేలా అవగాహన కల్పించడం ఇలాంటి అంశాలపై చర్చించారు.కలెక్టర్ రైతులతో బ్యాంకింగ్ సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ సమీక్షలో డీఏఓ శ్రీధర్ స్వామి, ఎల్డిఎం ఉత్పల్ సింగ్,ఎంఏఓ కేంద్రే ఆకాష్,నార్నూర్ మండల వ్యవసాయ విస్తరణ అధికారులు,ఎస్బిఐ నార్నూర్ బ్యాంకింగ్ మేనేజర్లు,సహకార బ్యాంకింగ్ తాడిహడప్నూర్,టీజీబీ భీం పూర్ లు పాల్గొన్నారు.



## లిఫ్ట్ ఇరిగేషన్ డిజిటల్ సర్వేను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**సమయజ్యోతి న్యూస్ జూలై 31 బజార్ హత్నూర్**

నేరడిగొండ మండలంలోని బుగ్గారం మరియు తేజాపూర్, పొచ్చెర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సర్వే తేజాపూర్ సమీపంలో జరగగా సర్వే పనులు పరిశీలించి అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద బుగ్గారం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2800 ఎకరాలకు సాగునీరు అందుతుంది అని అన్నారు అదేవిధంగా తేజాపూర్ పొచ్చెర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా 4 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది అని అన్నారు ఈ రెండు సర్వేలు పూర్తి కాగానే పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సర్వే పూర్తి చేసి పనులు మొదలు పెడతాము అని అన్నారు అదేవిధంగా పిప్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 3000 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది అని అన్నారు ఈ సర్వే ప్రైవేటు సంస్థ అయినటువంటి నా భూమి నా హక్కు సివిల్ సర్వేస్ కంపెనీ ద్వారా డిజిటల్ సర్వే చేయడం జరుగుతుంది అని అన్నారు ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజనీర్ భీంరావ్ మరియు మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు ఉన్నారు



# కమ్యూనిటీ హాల్ పనులకు శంకుస్థాపన

## కార్పొరేటర్ సింధూ ఆదర్శ్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

గురువారం భారతి నగర్ డివిజన్ పరిధిలోని మ్యాక్ సొసైటీ కాలనీలో కమ్యూనిటీ హాల్ లో మిగిలిన పనులకు శంకుస్థాపన చేసినట్లు కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు తెలిపారు సుమారు రూ 22 లక్షల వ్యయంతో ప్లంబింగ్ ఎలక్ట్రికల్ స్టోర్ రూమ్ ఫ్లోరింగ్ వంటి కీలక పనులు చేపట్టనున్నట్లు కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారుఈ సందర్భంగా కార్పొరేటర్ ఎల్ఐజీ కాలనీ లో జరుగుతున్న వాటర్ డ్రైన్ పనులు బొంబాయి కాలనీ లోని కమ్యూనిటీ హాల్ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఫైజాన్ ఎల్ఐజీ కాలనీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి బిఆర్ఎస్ వి జిల్లా కోఆర్డినేటర్ చిన్న మ్యాక్ సొసైటీ కాలనీ అధ్యక్షులు సలీం సెక్రటరీ నందగోపాల్ డైరెక్టర్లు పాపయ్య దుర్గా రెడ్డి రామరావు మహిళా నాయకురాలు కళ్యాణి నిర్మల కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు



# నిరుపేదలకు అండగా సిఎంఆర్ఎఫ్

## ఎమ్మెల్యే జిఎంఆర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

రామచంద్రపురం డివిజన్ పరిధిలోని మయూరి నగర్ కాలనీకి చెందిన బిక్షపతి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు చికిత్స నిమిత్తం రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి మంజూరు అయింది ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిక్షపతి కుటుంబ సభ్యులకు ఎల్ఓసి అనుమతి పత్రాలను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిది పనిచేస్తుందని తెలిపారు



# ఆ ఎమ్మెల్యేలపై స్పీకరే నిర్ణయం తీసుకుంటారు

## : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

గతంలో ఫిరాయింపులను ప్రోత్సహించిన బిఆర్ఎస్, ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించడం తగదని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి, పార్లమెంటరీ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి లతో కలిసి గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సుమారు 60 మంది ఎమ్మెల్యేలను ఎమ్మెల్సీలను జడ్పీ చైర్మన్లను ఇతర ప్రజాప్రతినిధుల ఫిరాయింపులను ప్రోత్సహించిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలన పట్ల ఆకర్షితులై కాంగ్రెస్లో చేరిన ఎమ్మెల్యేలపై చర్య తీసుకోవాలంటూ సుప్రీంకోర్టును బిఆర్ఎస్ ఆశ్రయించగా, స్పీకర్ పరిధిలో ఉంటుందని, దీనిపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించడం జరిగిందని అన్నారు. మేము మొదటి నుంచి చెబుతూనే ఉన్నాం. దీనిపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పినా, బిఆర్ఎస్ నానా యాగి చేసిందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ తలారి రాణి నర్సింహులు, జిల్లా నాయకులు కొండం రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, శ్రీనివాస్ గౌడ్, అరుట్ల మహేష్, కంచర్ల రాజలింగం గౌడ్, నరేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలు సాధ్యం

## : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్



విద్య ద్వారా మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధ్యమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, తంగళ్ళపల్లి మండలంలోని దమ్మన్నపేట, మండేపల్లి గ్రామాలలో తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను కేకే మహేందర్ రెడ్డి తో కలిసి, కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ద్వారా మాత్రమే ఉన్నత లక్ష్యాలు సాధిస్తామని అన్నారు. పేదలు అధికంగా ఉండే ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పిల్లలకు జాతీయ స్థాయి పోటీ పరీక్షల రాసేందుకు ఆన్ లైన్ తరగతుల ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢిల్లీలో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని విద్యార్థులకు కూడా అందిస్తున్నామని అన్నారు. ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచింగ్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. విద్యార్థి జీవితంలో 10,11,12వ తరగతులు 3 సంవత్సరాలు చాలా కీలక సమయమని, దీనిని సద్వినియోగం చేసుకుంటే జీవితం బాగుంటుందని అన్నారు. ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని, కాలిక్యులస్, ఆర్గానిక్ ఫార్మింగ్, ఎలక్ట్రో మ్యాగ్నెటిసమ్ వంటి ముఖ్యమైన పాఠ్యాంశాలను కాన్సెప్ట్ పక్కాగా నేర్చుకోవాలని అన్నారు. ఆన్ లైన్ తరగతులలో మన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఆన్ లైన్ తరగతులు శిక్షణ సౌకర్యం విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కేకే మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున పేదలకు నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని విజయవంతం కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తాసిల్దార్ జయంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభయాంజనేయ స్వామి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

పటాన్చెరు డివిజన్ పరిధిలోని కృషి డిఫెన్స్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజ కార్యక్రమాలలో స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి కాలనీ అధ్యక్షులు అమరేందర్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు



# ఎంపీడీవో కు బిజెపి శ్రేణుల సన్మానం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ ఎంపీడీవో లచ్చాలును గురువారం బిజెపి మండల అధ్యక్షులు సొల్ల క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఏళ్ల గిరిధర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కాసోడి రమేష్, మీస శంకర్, బుర్ర శ్రీనివాస్, బత్తుల గణేష్ నాగేష్ , హైకోర్టు బిజెపి లీగల్ టీం మెంబర్ జక్కుల నూతన్ కుమార్, ధీటి సత్తయ్య పాల్గొన్నారు.



# నూతన రేషన్ కార్డులతో పేద ప్రజలకు ఆహార భద్రత : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 31.

ప్రభుత్వం అందజేస్తున్న నూతన రేషన్ రేషన్ కార్డుల వల్ల పేద ప్రజలందరికీ ఆహార భద్రత కలుగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం తానూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ తో కలిసి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల పంపిణీతో ప్రజలకు మేలు కలుగుతుందని తెలిపారు. తానూర్ మండలానికి గాను 1853 నూతన రేషన్ కార్డులు మంజూరు కాగా, 2575 రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు అదనంగా చేర్చడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా రేషన్ కార్డులు అందిస్తామని అన్నారు. ప్రజలు ఎప్పుడైనా నూతన రేషన్ కార్డుల కొరకు గానీ, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చుటకు గాను దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. రేషన్ కార్డులు పొందిన వారు క్రమం తప్పకుండా తమ కోటా బియ్యాన్ని పొందాలన్నారు. ప్రభుత్వం నాణ్యమైన బియ్యాన్ని అందిస్తుందని, ప్రజలు వాటిని వినియోగించుకోవాలని తెలిపారు.ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, నూతన రేషన్ కార్డుల పంపిణీ సంతోషకరమైన విషయం అని అన్నారు. పేదలకు ప్రతి నెలా బియ్యం అందిస్తున్నందుకు గానూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన రేషన్ కార్డుల పంపిణీతో ప్రజలకు ఇబ్బందులు తీరుతాయని అన్నారు.ఈ నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ మహేందర్, ఇతర అధికారులు, రేషన్ కార్డుల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.




# అభివృద్ధి కోసమే ఫిరాయించా: తెల్లం

భద్రాచలం,జూలై31(సమయజ్యోతి):

భారత రాష్ట్ర సమితినుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వేటుపై సుప్రీంకోర్టు తీర్పును శిరసా వహిస్తానని భద్రాచలం శాసనసభ్యుడు తెల్లం వెంకటరావు అన్నారు.కోర్టు తీర్పులపై తమకు గౌరవం ఉందన్నారు. ప్రజాప్రతినిధిగా భద్రాచలం అభివృద్ధి కోసమే అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లోకి వెళ్లానని స్పష్టంచేశారు. నియోజకవర్గంలో తనకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందన్న ఆయన.. ఒకవేళ ఉపఎన్నికలు వచ్చినా మళ్లీ గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధి తనకు ముఖ్యమని అన్నారు. వెనకబడ్డ భద్రాచలం విషయంలో తాను నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యా అందించాలి
## :కలెక్టర్ సందీప్ కుమార్ ఝులిమ

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం కలెక్టరు, రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల నామాపూర్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్స్, స్టోర్ రూమ్ లను స్వయంగా తిరిగి పరిశీలించారు. విద్యార్థులచే హిందీ ఇంగ్లీష్ పాఠాలను చదివించి పలు ప్రశ్నలు అడిగి సమాదానాలు రాబాట్టారు. స్కూల్ లోని విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారు ఏమి తిన్నారు. ఎలా ఉంది ఫుడ్ అని అడిగి తెలుసుకుని, టేబుల్ టెన్నిస్ గేమ్స్ ఆడాలని పేర్కొన్నారు. హాజరు వివరాలు స్వయంగా పరిశీలించి అటెండెన్స్ వివరాలు తెలుసుకున్నారు.



# ఎలుగు బంటి దాడిలో గాయపడిన వ్యక్తికి 50వేల రూ.ల చెక్కును అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లా కేంద్రం ఆదిలాబాద్ లోని కలెక్టర్ కార్యాలయం నందు గురువారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా తన ఛాంబర్ లో ఇటీవలే మే నెలలో ఎలుగుబంటి దాడిలో గాయపడిన ఆదివాసీ కొలాం గిరిజనుడు చాకటి దేవ్ రావ్ తండ్రి జైతు,వాఘాపూర్ గారికి 50,000/- రూ.ల ముఖ్యమంత్రి సహాయనిది చెక్ ను అందజేశారు.చెక్ ను తీసుకున్న బాధితుడు చాకటీ దేవ్ రావ్ మాట్లాడుతు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,జిల్లా కలెక్టర్ రాజర్షి షా లకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,గ్రామస్థులు భూపెల్లి శ్రీధర్,కుదురుపాక సురేష్,మర్సకోల అశోక్,మర్సకోల గౌతమ్,గోస్కూరి రాజేందర్,చాకటి రాము తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ విప్, కేకే..
## ప్రైవేట్ ఆస్పత్రికి ప్రారంభోత్సవం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాసు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తో కలిసి, ముస్తాబాద్ మండల కేంద్రంలో ఎంబిబిఎస్ వైద్యులు బొప్ప సాగర్ ఏర్పాటు చేసిన వరలక్ష్మి ఆసుపత్రిని ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో పార్లమెంటరీ కో కన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏళ్ల బాల్రెడ్డి, నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ లను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

**సమయజ్యోతి న్యూస్ జూలై 31 బజార్ హత్నూర్**

బజార్ హత్నూర్ మండల కేంద్రంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య నివాసం లోబోథ్ ఆత్మ చైర్మన్గా పదవి బాధ్యతలు చేపట్టిన గొర్ల రాజు యాదవ్ ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్యలను బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జల్కే పాండురంగు సీనియర్ నాయకుడు శివుడు పాండురంగు, కళ్లెం విట్టల్ కొడారి నరేష్ మల్లెపూల నర్సయ్య గొల్ల నాగు రమేష్ మునేశ్వర్ నారాయణ సోమిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు



# రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ
## : జిల్లా కలెక్టర్ రాజర్షి షా
## రేషన్ షాపులలో అన్ని సరుకులు ఇవ్వాలి: అనిల్ జాదవ్.

**సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్**

రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదిక లో లబ్ధిదారులకు ఆహార భద్రత కార్డులను బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ రేషన్ కార్డు పొందినవారు సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు.సన్న బియ్యంలో అధిక పోషకాలు ఎక్కువగా ఉంటాయని వాటిని తినడం వల్ల మనిషి ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.రేషన్ బియ్యం అమ్ముతూ పట్టుబడితే రేషన్ కార్డు రద్దు చేస్తా మన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేస్తా మన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.ప్రతి ఒక్కరు తమ పిల్లలను పనులకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కుటుంబంలో ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అవసరమే అని అన్నారు.రేషన్ కార్డుల పంపిణీలో భేదాలు తెలుపకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలన్నారు.రేషన్ షాపులలో రాష్ట్ర ప్రభుత్వం నిత్యవసర సరుకులు ప్రజలకు సగం ధరకే ఇవ్వాలన్నారు.గుడిహత్నూర్ మండలంలో అధికంగా కూరగాయలు పండిస్తారు కావున మండలంలో జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తానని అన్నారు. వర్షాకాలం దృష్ట్యా మండల ప్రజలు జాగ్రత్త వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య.జాయింట్ కలెక్టర్ శ్యామల దేవి, ఆర్డీవో స్రవంతి, ఎమ్మార్వో కవిత రెడ్డి, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్ర కోటేష్, పిఎస్సిఎస్ చైర్మన్ సంజు ముండే, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్యాల కరుణాకర్, నాయకులు తిరుమల గౌడ్, ఆడే శీలా, రమేష్ జాదవ్, రవి నాయక్,ససానే మాధవ్ తదితరులు పాల్గొన్నారు.




# ఆత్మకూరు మార్కెట్ ని అభివృద్ధి చేస్తాను.
## మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి**
**ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎం.డి. రహమతుల్లా, వైస్ చైర్మన్ నర్వ కృష్ణారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ గా టి. రవి కాంత్, టి. రాజు, డి. మోహన్, పి. విష్ణు, ఎస్. శ్యామ్, కామలాకర్ గౌడ్, రాజు, డి. గోవర్ధన్, అరవింద్ రెడ్డి, మన్యమ్మ, నరేష్ ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర పాడి పరిశ్రమల, మత్స్య క్రీడల శాఖ మంత్రి డాక్టర్ శ్రీహరి, భారత్ క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డు లో రైతులకు ఏ సమస్యలు తలెత్తకుండా వారికి నిరంతరం సేవలు అందించాలని అన్నారు. మార్కెట్ చైర్మన్ వైస్ చైర్మన్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన పాలక సభ్యులు నిన్నటి వరకు ఒక లెక్క నేటి నుంచి మరొక లెక్క అన్నారు. ఈరోజు నుండి మీపైన బాధ్యత ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మీరు చేసిన సేవలు గుర్తించి ఇచ్చిన పదవి అన్నారు. ఈ ప్రాంతం వ్యవసాయ ఆధారత ప్రాంతమని అన్నారు. ఈ ప్రాంతంలో ఉండే రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వారి యొక్క సంక్షేమం, వారి అభివృద్ధి కోసం నిరంతర కృషి చేయాలని అన్నారు. మార్కెట్ అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తానని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ పగటి కలలు కంటుందని అన్నారు. మూడున్నర ఏళ్ల తర్వాత మేమే అధికారులకు వస్తున్నామని కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బి. ఆర్. ఎస్ పార్టీ మూడున్నర ఏళ్లు కాదు 30 ఏళ్ల అయినా అధికారంలోకి రారని అన్నారు. జూరాల ప్రాజెక్టు, నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టు లాను కట్టింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. జూరాల ప్రాజెక్టు గేట్లు లూజ్ అయితే ప్రాజెక్టుపై బిఆర్ఎస్ పార్టీ తప్పుడు ప్రచారాలకు తెర లేపారని అన్నారు.లక్ష క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉంటే ప్రాజెక్టు కెపాసిటీ సరిపోతలేదని అనడం వారి అవివేకానికి నిదర్శనం అన్నారు. ప్రాజెక్టులో 12 లక్షల క్యూసెక్కుల నీరును నిలువ చేసుకున్న ప్రాజెక్టుకు ఎలాంటి ముప్పు లేదని అధికారులు వెల్లడించారని అన్నారు. మీ మాదిరిగా కాలేశ్వరం ప్రాజెక్టు కాదు కట్టింది. కూలిపోవడానికి అని మంత్రి ఎద్దేవ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు లక్షలాది ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిపించుకుందాం. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని అన్నారు.తొలి సారిగా మైనార్టీ కి చైర్మన్ గా ఎం. డి. రహిమతుల్లాకు అవకాశం. మార్కెట్ యార్డు ఏర్పడినప్పటి నుండి నేటి వరకు ముస్లిం మైనార్టీలకు గత పాలకులు అవకాశం కల్పించలేదు. మక్తల్ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానిక మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ముదిరాజ్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో అయన పెద్ద మనసుతో ఎం. డి.రహిమతుల్లా కు చైర్మన్ పదవి కట్టబెట్టి ఆయన సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. భావద్వేగానికి లోనైన ఎం.డి. రహమతుల్లా. మా నాన్న ఎండి ఉస్మాన్ కాంగ్రెస్ పార్టీ కోసం తన చివరి శ్వాస వరకు కంకణ బద్ధుడనై పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారని నేడు మా నాన్న మా కళ్ళ ముందు లేకపోక పోవడం మా కుటుంబానికి చాలా బాధా కరమని భావద్వేగానికి లోనయ్యారు.మా నాన్న అకాల మరణంతో మా కుటుంబం దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నపుడు శ్రీరాం రాంభూపాల్ అమ్మాపురం సంస్థాన దిశు లు మమ్ములను ఆదరించి మా కుటుంబాన్ని ఆదుకున్నారని అన్నారు. చైర్మన్ పదవి పోటీ పడిన వారిలో నేను చిన్న వయసు వాడి అయిన నాకు మార్కెట్ చైర్మన్ పదవి కోసం నాకంటే వయసులో పెద్దవారు పదవిని ఆశించినప్పటికీ మంత్రి డాక్టర్ శ్రీహరి అందరికీ నచ్చచెప్పి ఒప్పించి నన్ను మార్కెట్ చైర్మన్ గా చేశారని అన్నారు. మంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కల్లుగీత రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ అబేదుల్లా కొత్వాల్, డిసిసిబి చైర్మన్ మావిళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి, అమ్మపురం సంస్థాన దీశులు శ్రీ రాజ శ్రీ రాంభూపాల్, పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయచూరు పరమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తులసిరాజు యాదవ్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు, అమరచింత మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటిసి అయూబ్ ఖాన్, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య సాగర్ తో పాటు వివిధ గ్రామాల రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో జూలై 31.**

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం తానూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పలు విభాగాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలు, స్టోర్, ఇంజక్షన్ రూమ్, మందుల గదులను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులను, సిబ్బందిని వివిధ అంశాలపై ప్రశ్నించి పలు సూచనలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. బాలింతలు, గర్భిణీలకు ప్రత్యేక పర్యవేక్షణలో వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందుబాటులో ఉండేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ మహేందర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# యూపిఐ లావాదేవీలపై ఛార్జీలు

## ఎట్టకేలకు తప్పదంటూ ప్రకటించిన ఐసిఐసిఐ?

**న్యూఢిల్లీ,జూలై31(సమయజ్యోతి):**

యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న వేళ ఇటీవల కేంద్రం సుంకాలు విధించే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. కానీ ప్రభుత్వం దీనిని తోసిపుచ్చింది. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు- ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇది ఎప్పటికీ ఉచితంగా ఉండకూడదు. దీనిపై ఛార్జీలు అవసరం. ఎవరో ఒకరు వాటిని భరించాలని అన్నారు. ఇప్పుడు చిన్నిచిన్న దుకాణాలు మొదలు మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలు చేయనున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు తెలుస్తోంది. ఐసీఐసీఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్ పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలుచేయనున్నట్లు- సమాచారం. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్ పేమెంట్లు- నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు- ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు భరిస్తోంది. ఈ క్రమంలోనే ఖర్చుల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు- సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.

# పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయం

### 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందే- ఫిరాయింపులపై పార్లమెంట్ సమీక్షించాలి

### బిఆఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ,జూలై31(సమయజ్యోతి):**

తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్‌ను అనుమతించిన సుప్రీం ధర్మాసనం.. వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకోర్టు వేటు వేయాలంటూ బీఆర్ఎస్ చేసిన విజ్ఞప్తిని సీజేఐ గవాయ్ తోసిపుచ్చారు. అదే సమయంలో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించాలనే అంశంపై పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ గవాయ్ ఆదేశించారు.కాగా, ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపుల కేసుపై సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. స్పీకర్ తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాలనే అంశంలో కోర్టులు జోక్యం చేసుకోవచ్చా లేదా అనే దానిపై సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు నడిచాయి. ఈ వాదనల అనంతరం ఈ ఏడాది ఏప్రిల్ 3వ తేదీన జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. బిఆర్ఎస్ నుంచి పార్టీ మారిన 10 ఎమ్మెల్యేలపై అనర్హత చర్యలను వీలైనంత త్వరగా లేదా 3 నెలల్లోపు నిర్ణయించాలని సూచించింది. ఏ ఎమ్మెల్యే అయినా.. స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చు. రాజకీయ ఫిరాయింపులు జాతీయ చర్చనీయాంశంగా మారింది. దాన్ని అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని వ్యాఖ్యానించారు. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంటులో చేసిన వివిధ ప్రసంగాలను కూడా పరిశీలించాం. రాజేష్ పైలట్.. దేవేంద్ర నాథ్ మున్షి లాగా.. అనర్హత



చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోవడంలో డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రిబ్యునల్‌గా వ్యవహరిస్తారని తీర్పులో ధర్మాసనం స్పష్టం చేసింది. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ 2014 నవంబర్ 22న తీర్పును పక్కన పెడుతున్నాము. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు సంవత్సరాల తరబడి సాగడం అర్థరహితంగా అని పేర్కొంది. ఈ అంశంపై సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసిన తర్వాత మాత్రమే స్పీకర్ ఎమ్మెల్యేలకు నోటీసు జారీ చేయడం దురదృష్టకరం అని వ్యాఖ్యానించింది. అపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది.ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్‌లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం తీర్పు వెలువడింది. దీనిని బిఆర్ఎస్ నేతలు స్వాగతించాలి.

# సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు షాక్

## - ముందస్తు బెయిల్ రద్దు చేసిన సుప్రీం

## -మూడు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం

**న్యూఢిల్లీ,జూలై31(సమయజ్యోతి):**

ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరిం చింది. ఇకపోతే సంజయ్ కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై గత విచారణ సందర్భంగా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు- ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు.. ఇదెలా సాధ్యం అని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు.. అన్ని చూసుకోవాలి గానీ, ఇష్టానుసారం చేస్తే ఎలా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు. సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ- నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్యాప్ -టె-క్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు- చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించక పోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# నిబంధనలకు విరుద్ధంగా డీజేలు నిర్వహిస్తే సీజ్ చేస్తాం :ఎస్సై శైలేందర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం ఉత్సవాల సందర్భంగా బాల్కొండ మండలంలో డీజే లకు ఎలాంటి అనుమతి లేదని, అక్రమంగా ఎవరైనా వినియోగిస్తే సీజ్ చేస్తామని ఠాణా లో ఎస్సై శైలేందర్ పేర్కొన్నారు. ఆయన డీజే నిర్వాహకులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించవద్దని హెచ్చరించారు



# ఇంజనీరింగ్ కళాశాల మంజూరు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం..

### తెలంగాణ విశ్వవిద్యాలయ అభివృద్ధి

### కాంగ్రెస్ తోని సాధ్యం: వరద బట్టు వేణు రాజ్

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్ బ్యూరో**

తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేసిన సందర్భంగా ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరద బట్టు వేణు రాజ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి, పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి, సంబరాలు నిర్వహించారు. వేణు రాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు . విశ్వవిద్యాలయాలు స్థాపించాలన్న వాటిలో విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేయాలన్న, కేవలం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అన్నారు. గత పది సం.లుగా తెరాస ప్రభుత్వంలో కలగానే మిగిలిపోయిన తెలంగాణ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల, కాంగ్రెస్ ప్రభుత్వంలో సాకారం అయిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్నత విద్య పట్ల ఉన్న చిత్తశుద్ధే అన్నారు. దీని మంజూరు వెనుక కాంగ్రెస్ అగ్ర నాయకులందరూ ఎనలేని కృషి చేశారని, అనునిత్యం ఇంజనీరింగ్ కళాశాల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డికి గుర్తు చేస్తూ ఇంజనీరింగ్ కళాశాల మంజూరులో కీలక పాత్ర పోషించారని అన్నారు. భవిష్యత్తులో కూడా విశ్వవిద్యాలయానికి కావలసిన అన్ని వసతులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని, తెలంగాణ విశ్వవిద్యాలయానికి బడ్జెట్లో కేటాయింపులు, ప్రజా ప్రభుత్వంలో పెరుగుతుందని, తెలంగాణ విశ్వవిద్యాలయమే కాకుండా రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ హయాంలో జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్. రమేష్, గంగప్రసాద్, నరేందర్ సింగ్, సాయికిరణ్ కౌశిక్, మణి, రాజు పాల్గొన్నారు.



# కళ్యాణ లక్ష్మీ,షాదిముబారక్ చెక్కులను, రేషన్ కార్డులను పంపిణీచేసిన మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమరచింత మండల పరిధి వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణలక్ష్మీ,షాదిముబారక్ లబ్ధిదారులకు 36 చెక్కులను, కొత్తగా మంజూరు అయిన రేషన్ కార్డులను అమరచింత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర పాడి పరిశ్రమల మత్స్య, క్రీడ శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి,టీపీసీసీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్, మార్కెట్ చైర్మన్ ఎం. డి. రహిమతుల్లా పంపిణీ చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. కొంతమంది ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకుంటే బిల్లులు రావని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. వారి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాపాలన సాగిస్తున్నారని అన్నారు.అధికారులపై మండిపడిన మంత్రి.. హౌసింగ్, ఇతరఅతర శాఖలకు సంబంధించిన అధికారులు మంత్రి కార్యక్రమానికి రాకపోవడంతో సంబంధిత అధికారులపై మంత్రి మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలంటే సంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలి కదా అని ఆ శాఖల అధికారులపై మండిపడ్డాడు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి,రవి కుమార్, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ నాగరాజ్ గౌడ్, డిప్యూటీ తహసీల్దార్ రెడ్యానాయక్, ఆర్.ఐ.గోపాల్ యాదవ్, జూనియర్ అసిస్టెంట్ నాగేందర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీటిసి అయూబ్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు ఎస్.ఎం. అరుణ్ కుమార్, మండల అధ్యక్షుడు కొత్తగౌని మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విష్ణు, ఎస్. శ్యామ్ కుమార్, టి రవికాంత్, కమలాకర్ గౌడ్,టి. రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ పి.తిరుమలేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు హన్మంత్ నాయక్,పామిరెడ్డి పల్లి బండి బీసీ రెడ్డి, వీరేష్ గౌడ్, నరేష్ యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ధర్మస్థలి మిస్టరీ మరణాలపై దర్యాప్తు

## పారిశుధ్య కార్మికుడి చూపిన చోట తవ్వకాలు

## తాజాగా తవ్విన చోట కొన్ని అవశేషాల గుర్తింపు

**బెంగళూరు,జూలై31(సమయజ్యోతి):**

కర్ణాటకలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల' లో అనుమానస్పద మరణాల మిస్టరీపై విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించిన దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పటి పారిశుధ్య కార్మికుడు చూపించిన ప్రదేశాల్లో తవ్వకాలు చేపట్టింది. ఇందులో ఓ చోట గురువారం కొన్ని అవశేషాలను గుర్తించారు. ఇప్పటివరకు ఈ కేసులో బయటపడిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. పారిశుధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఈ అనుమానాస్పద మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గత సోమవారం నుంచి సిట్ అధికారులు.. అతడిని వెంట తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టారు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలి వైపు ఉన్న ప్రాంతం నుంచి పరిశోధన ప్రారంభించారు. మృత దేహాలను పూడ్చిపెట్టినట్లుగా మొత్తం 13 చోట్లను అతడు గుర్తించగా.. ఆ ప్రాంతాల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం ఆరో ప్రాంతంలో మానవ అవశేషాలు బయటపడ్డాయి. వాటిని ఫోరెన్సిక్ బృందం సేకరించి ల్యాబ్‌కు పంపించింది. ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాతే వాటి గురించి వివరాలు తెలుస్తాయని సిట్ అధికారులు చెబుతున్నారు. దక్షిణ కన్నడ జిల్లాలో ధర్మస్థల ప్రముఖ శైవ క్షేత్రం.లో ఇటీవల మిస్టరీ మరణాలపై దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. గతంలో అక్కడ పనిచేసి వెళ్లిపోయిన ఓ పారిశుధ్య కార్మికుడు.. ఇటీవల సంచలన ఆరోపణలు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య ఇక్కడ అనేక మంది మహిళలు, యువతులు హత్యకు గురయ్యారని.. వారి మృతదేహాలను తానే పూడ్చి పెట్టానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అవన్నీ అనుమానాస్పద రీతిలో అదృశ్యమైన వారివని, లైంగిక దాడులకు గురై చనిపోయినట్లు- అనుమానాలున్నట్లు- పేర్కొనడం అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. 2014 డిసెంబరులో తమ కుటుంబంలోని ఒక యువతిని కొందరు లైంగికంగా వేధిస్తుండడంతో తాము అజ్ఞాతం లోకి వెళ్లిపోయామని ఆ వ్యక్తి చెప్పినట్లు సమాచారం. మృతదేహాలను ఎవరు ఖననం చేయమన్నారు? వాటిని ఎవరి సహాయంతో తీసుకువెళ్లేవారు? తదితర ప్రశ్నలను సిట్ అధికారులు అడిగి అతడి నుంచి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది.

# సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం

## సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు రూపకల్పన

## క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**వనపర్తి,జూలై31(సమయజ్యోతి):**

సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు సమగ్రమైన తెలంగాణ క్రీడా విధానం 2025 ను రూపొందించామని రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం వనపర్తి నియోజకవర్గం ఆత్మకూరు కేంద్రంలో స్పోర్ట్స్ కాంక్లేవ్ పోస్టర్ ను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- చైర్మన్ శివసేన రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్ద కాలం నుండి విస్మరించబడ్డ క్రీడా రంగం సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లో వేగవంతంగా పనిచేస్తూ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి కృషి జరుగు తోందని అన్నారు. తాను క్రీడల మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొత్తం మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలోనే క్రీడారంగం ఆమోదింపబడటం ఒక క్రీడాకారుడిగా తనకి ఎంతో సంతోషం కలిగించిందని అన్నారు.దీర్ఘకాలిక క్రీడల అభివృద్ధి కొరకు ఉద్దేశించబడ్డాయి ఈ నూతన క్రీడా విధానాన్ని పటిష్ఠంగా పకడ్బందీగా అమలు చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న వివిధ క్రీడారంగా నిష్ణాతులు వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధుల తో కలిసి విస్తృత స్థాయిలో ఈ స్పోర్ట్స్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. క్రీడా విధానం2025 తెలంగాణ క్రీడా రంగానికి ఒక నూతన వరవడిని సాధించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ క్రీడా రంగానికి క్రీడాకారులకు మంచి భవిష్యత్తును అంద జేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి, మట్టిలో మాణిక్యాల ను గుర్తించి వారిని ప్రపంచ ఛాంపియన్లుగా ఇది ఈ క్రీడా విధానం ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, నూతన క్రీడా విధానంతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ- బాధ్యతలు మరింత విస్తరించ బోతున్నాయని వివిధ శాఖల సమన్వ




యంతో విస్తృతంగా క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి, క్రీడాకారుల ను ప్రోత్సహించడానికి బహుముఖంగా తెలంగాణ స్పోర్ట్స్ తాటి సేవలు అందజేయడానికి ఈ విధానం ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గారి కృషి వల్ల తెలంగాణ క్రీడారంగ ముఖచిత్రమే మారిపోతుందని ఆయన వివరించారు. ఒక ఏడాదికాలంగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున ఎన్నో జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలు నిర్వహించామని, రానున్న రోజుల్లో ఈ కృషిని మరింత రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ- చైర్మన్ రహమతుల్లా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేల అనర్థ పిటిషన్‌పై తీర్పు

## స్వాగతించిన తెలంగాణ బిజెపి

**హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):**

పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బిజెపి స్వాగతించింది. ఈ తీర్పను తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు- చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమన్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీ-లు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటు-ందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

# ఎన్డీఏకు పన్నీర్ సెల్వం గుడ్‌బై

**చెన్నై,జూలై31(సమయజ్యోతి):**

తమిళ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది.దివంగత నేత జయలలితకు అత్యంత నమ్మకస్థుడుగా ఉన్నమాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం ఎన్డీయే నుంచి వైదొలగారు. ఈ మేరకు మాజీ మంత్రి, సెల్వంకు నమ్మినబంటు రామచంద్రన్ ప్రకటించారు. ఆయన ప్రకటిస్తున్న సమయంలో సెల్వం కూడా అక్కడే ఉన్నారు. మార్నింగ్ వాక్ సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. పలు విషయాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఎన్డీయే నుంచి వైదొలగుతున్నట్లు- ప్రకటించడం గమనార్హం. ఎన్డీయే కూటమితో పూర్తిగా సంబంధాలు తెంచుకున్నట్లు- ఆ ప్రకటనలో తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పన్నీర్ సెల్వం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నట్లు- పేర్కొన్నారు. పొత్తుల గురించి ఇప్పుడు ప్రస్తావించాల్సిన సమయం కాదని, ఎన్నికల ముంగిట ఆ అంశం గురించి మాట్లాడతామని అన్నారు. మరోవైపు ఇటీవల సినీనటు-డు విజయ్ ప్రారంభించిన తమిళ వెట్రి కళగ (టీవీకే)తో ఓపీఎస్ చేతులు కలిపే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. పన్నీర్ సెల్వాన్ని విలేకరులు పొత్తుల అంశం గురించి ప్రస్తావించగా.. కాలమే చెబుతుంది అంటూ.. సమాధానం దాటవేశారు. పన్నీర్ సెల్వం ఒకానొక సమయంలో ఏఐఏడీఎంకేలో కీలకంగా వ్యవహరించారు. ఎన్డీయే కూటమిలోనూ ముఖ్యపాత్ర పోషించారు. అయితే, పార్టీలో ఏర్పడిన అంతర్గత కలహాలతో బహిష్కరణకు గురైన ఆయన.. సొంతంగా తన వర్గాన్ని విస్తరించుకున్నారు. తాజాగా ఎన్డీయే నుంచి కూడా బయటకు రావడం.. 2026 అసెంబ్లీ ఎన్నికల ముంగిట తమిళ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

# తిరుమలలో రీల్స్ చేస్తే కఠిన చర్యలు

## హెచ్చరించిన టిటిడి అధికారులు

**తిరుమల,జూలై31(సమయజ్యోతి):**

రీల్స్ పిచ్చిలో కొందరు తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్నారు. అలాగే స్వామికి అపచారం చేస్తున్నారు. దీనిపై టిటిడి తీవ్రంగా స్పందించింది. ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడ వీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు, డ్యాన్స్‌లతో సోషల్ మీడియా రీల్స్ చేస్తుండటంపై తిరుమల తిరుపతి దేవస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని తితిదే విజిలెన్స్ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని తితిదే పేర్కొంది. పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని.. ఇక్కడ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కావాలని సూచించింది. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తితిదే తెలిపింది.

# ముగిసిన అమెరికా కాన్సూల్ జనరల్ పదవీకాలం

## జెన్నిఫర్ లార్సన్‌కు శ్రీధర్ బాబు

## ఆత్మీయ వీడ్కోలు

**హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):**

హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్‌గా తన పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న జెన్నిఫర్ లార్సన్‌కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే చేనేత చీరను ఆమెకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ - అమెరికా మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు ఆమె విశేష కృషి చేశారని కొనియాడారు. విద్య, సాంస్కృతిక మార్పిడి, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించారన్నారు. ఆమె అందించిన సహకారం,దార్శనికతకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లోనూ తెలంగాణ -అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అయ్యేలా సహకారం అందించాలని కోరారు. ఆమె తదుపరి ప్రయాణంలోనూ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా ఆకాక్షించారు.



# సిగాచి ప్రమాదంపై హైకోర్టులో పిల్

## ప్రభుత్వానికి నోటీసులు జారీ

**హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):**

సంగారెడ్డి సిగాచి పరిశ్రమ ప్రమాదంపై హైకోర్టులో పిల్ దాఖలైంది. సిగాచి పరిశ్రమ ప్రమాదంపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిగాచిపై న్యాయవాది కె.బాబూరావు పిల్ దాఖలు చేశారు. పరిశ్రమలో భద్రతా చర్యలు తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. పేలుడు ఘటనలో ఇంకా 8 మంది ఆచూకీ దొరకలేదని హైకోర్టుకు తెలియజేశారు. బాధితులకు ప్రకటించిన పరిహారం ప్రభుత్వం ఇంకా చెల్లించలేదని, సిగాచి పరిశ్రమ యజమానిని ఇప్పటివరకు అరెస్టు చేయలేదని.. ప్రమాదంపై ఏర్పాటు- చేసిన కమిటీ- నివేదిక బయటపెట్టాలని పిటిషనర్ కోరారు.ఇదిలా ఉండగా.. ఫ్యాక్టరీలలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఇకపై అన్ని జిల్లాల్లో కెమికల్, ఫార్మా, హై-రిస్క్ పరిశ్రమలన్నింటికీ చెక్ లిస్ట్‌ను ప్రకటిస్తామన్నారు. నిబంధనలను ఉల్లంఘించే కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిగాచి ఫ్యాక్టరీ ఘటనలో ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన సాధారణ సూచనలను పాటించి ఉంటే, కంపెనీకి రూ. 20 నుంచి రూ. 25 లక్షలకు మించి ఖర్చు అయ్యేది కాదన్నారు. ఇప్పుడు ప్రమాదం జరగడం వల్ల రూ. 50 కోట్ల పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

# మంచిరేవులలో చిక్కిన చిరుత

**హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):**

గత 12 రోజులుగా అధికారులకు కంటి మీద కునుకులేకుండా చేసిన చిరుతపులి ఎట్టకేలకు చిక్కింది. మంచిరేవులలో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత పడిందని అధికారులు ప్రకటించారు. దీనిని నల్లమల్ల అడవిలో వదిలిపెట్టనున్నట్లు- తెలిపారు. నగర శివారులో గత రెండు వారాలుగా చిరుత సంచారం జనాలను భయాందోళనకు గురి చేస్తూ వచ్చింది. మృగవని పార్క్ గ్రేహౌండ్స్ పరిధిలో చిరుత సంచారం కలకలం రేపింది. దీనిని బంధించేందుకు 8 ట్రాప్ కెమెరాలు, 4 బోనులు ఏర్పాటు- చేశారు అధికారుల. అయినా అది చిక్కకుండా అధికారులను ముప్పు తిప్పలు పెట్టింది. ఈ క్రమంలో గత అర్ధరాత్రి దాటాక మొయినాబాద్ ఎకోటిక్ పార్క్‌లో ఏర్పాటు- చేసిన బోనులో చిరుత చిక్కింది. దీనిని నల్లమల అటవీ ప్రాంతంలో వదిలి పెడతామని అధికారులు తెలిపారు.

# సరోగసి పేరుతో సృష్టిలో మోసాలు

## రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన పోలీసులు

**హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):**

సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ ముసుగులో దారుణాలు సాగించిన డాక్టర్ నమ్రత కేసులో అనేక అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఐవిఎఫ్ కోసం వచ్చిన వారిని సరోగసీ వైపు దారిమళ్లించి లక్షలు దండుకున్నట్లు గుర్తించారు. నమ్రతను 5 రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించిన కీలక అంశాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. సరోగసీ చేయకపోయినా చేసినట్లు నమ్మించి పలువురు దంపతులను మోసం చేశారని.. ఈ విషయాన్ని డాక్టర్ నమ్రత అంగీకరించారని పేర్కొన్నారు. రాజస్థాన్ దంపతులనూ సరోగసీ విషయంలోనూ నమ్రత మోసం చేశారు. వాళ్లు డీఎన్ఏ పరీక్షల నివేదికలు కావాలని అడగడంతో.. విషయం బయట పడుతుందని తప్పించుకున్నారు. కొన్ని రోజుల సమయం ఇస్తే తప్పును సరిదిద్దుతామని వారికి చెప్పారు. వినకపోవడంతో తన కుమారుడితో రాజస్థాన్ దంపతుల్ని బెదిరించారు. సరోగసీ పేరుతో 'సృష్టి'సెంటర్ చాలా మోసాలు చేసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే వారిని సరోగసీ వైపు మళ్లించి డబ్బులు దోచుకున్నారు. ఏపీలో కొంతమంది ఏఎన్ఎంల సహాయం కూడా తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి అనస్థీషియన్ డాక్టర్ సదానందం వీరికి పూర్తిస్థాయిలో సహకరించారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

# స్పీకర్‌కు సుప్రీం సూచనలు మాత్రమే చేసింది

## గతంలో ఫిరాయింపులను మరచిన బిఆర్ఎస్

## మీడియా సమావేశంలో మండపడ్డ అద్దంకి

**హైదరాబాద్,జూలై31(సమయజ్యోతి):**

ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. దీనిపై ఎవరికి వారు వక్ర భాష్యాలు చెబుతున్నారని అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభాహక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. గతంలో వారు చేసిన ఫిరాయింపుల గురించి మాట్లాడాలని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు వారు రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది వారే. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు. మేం ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని బతికించాం అన్నారు. గతంలో అక్రమాలకు పాల్పడి సమర్థించుకోవడం బిఆర్ఎస్ నేతలకే దక్కిందని అన్నారు. ప్రతిపక్ష హోదా ఉన్నా అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై మేం కోర్టుకు వెళ్లాలా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాంఅని అద్దంకి దయాకర్ అన్నారు. ఇలాంటి వారు చట్టాల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

## బస్తీ దవాఖాన, పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్ బ్యూరో**

ఖానాపూర్ లోని కమ్యునిటీ హాల్ లో కొనసాగుతున్న బస్తీ దవాఖానాను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చికిత్సల కోసం వచ్చిన రోగులను పలుకరించి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి వాకబు చేశారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. పీ.హెచ్.సీ తరహాలోనే అన్ని రకాల సేవలు అందిస్తూ, సరిపడా ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. కాగా, జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు సంబంధించిన వ్యర్థాలను రోజువారీగా సేకరిస్తూ నిర్దేశిత ప్రాంతంలో డిస్పోజ్ చేసేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇన్సినరేటర్ జిల్లాలో అందుబాటులో ఉన్నందున బయో వేస్టేజ్ ప్రక్రియ పక్కాగా జరిగేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ కాలూర్ లోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ ను సందర్శించి, మధ్యాహ మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. మెనూలో పొందుపర్చిన విధంగా పిల్లలకు పౌష్టిక ఆహారం అందించాలని హెచ్.ఎంకు సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రవిబాబు, ఈ.ఈ మురళీమోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## ఉపాధ్యాయ వృత్తిలో గోవింద సత్యనారాయణ సేవలు ఎనలేనివి పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి,

**సమయజ్యోతి ప్రతినిధి హన్మకొండ**



చిట్యాల మండలం చల్ల గరిగ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గోవింద సత్యనారాయన పదవీ విరమణసన్మాన మహొత్సవము హన్మకొండ జిల్లా పరకాల ఆర్ ఆర్ గార్డెండ్ లో జరగగా ముఖ్య అతిథిగా విచ్చేసి న శాసన సభ్యులు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వృత్తులలో కెల్లా ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది ఆ వృత్తిలో గోవింద సత్యనారాయణ అందించిన సేవలు అమోఘమని కొనియాడారు 36 ఏళ్ల పాటు వివిధ పాఠశాలల్లో చేసి విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దారని అన్నారు ఆత్మీయ అతిథి భూపాల్ పల్లి డి ఈ ఓ రాజేందర్ మాట్లాడుతూ విద్యా రంగం లో క్రమశిక్షణ గల టీచర్ గా సత్యనారాయణ తగిన గుర్తింపు పొందారని అన్నారు పి ఆర్ టి యు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రేగురి సుభాకర్ రెడ్డి కుసునపు కిరణ్ కుమార్ మాట్లాడుతూ గోవింద సత్యనారాయణ ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావం వృత్తినిబద్ధత క్రమశిక్షణ పాటించారని పి ఆర్ టీ యు సంఘం లో అంకిత భావం తో పని చేసి సంఘం బలోపేతం లో తన వంతు పాత్ర పోషించారని అన్నారు ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మందల తిరుపతిరెడ్డి ఫలిత శ్రీహరి చిట్యాల్ మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి చిట్యాల మండల పి ఆరు టీ యు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాస్ సూదం సాంబమూర్తి వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ రెడ్డి గిరగాని కృష్ణ. పింగిలి విజయ పాల్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా సెక్టోరియల్ అధికారులు సామల రమేష్ దుప్పటి రాజగోపాల్ డి సి ఈ బి సెక్రటరీ ఒంటేరు చంద్రశేఖర్, బర్ల స్వామి ఉపాధ్యాయులు శ్రీపాల్ చిలక మారి సదానందం కామిడి సతీష్ రెడ్డి పంచిక భగవాన్ రెడ్డి దుస్స సధాకర్ మధుకర్ రెడ్డి కుసుమ వెంకటేశ్వర్లు స్వామి కొండపర్తి హరిప్రసాద్ హాకీం దగ్గు తిరుపతిరావు రాజకుమార్ అచ్చ సుదర్శన్ మోడెం రాజేంద్ర బాబు సిలువేరు సురేందర్ వారి కుటుంబ సభ్యులు సంధ్య అల్లుడు కూతురు శ్రీకాంత్ సూచిత్ర అవినాష్ అఖిల బందు మిత్రులు తదితరులు పాల్గొని సత్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి.. ఆత్మగౌరవంతో జీవించాలి

## : పెట్రోల్ బంక్ ప్రారంభించిన ప్రభుత్వ విప్, కలెక్టర్, కేకే

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

మహిళలు ఆర్థికంగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రభుత్వ విప్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి లతో కలిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేట మండలం లింగన్నపేట గ్రామంలో శ్రీ షిర్డీ సాయిబాబా గ్రామ సమాఖ్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను ప్రారంభించారు. రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా నడిపే 3వ పెట్రోల్ బంక్ ప్రారంభించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పేదల సంక్షేమం ఎజెండాగా ఇందిరమ్మ పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని అన్నారు.ఇండియా అంటే ఇందిరా, ఇందిరా అంటే ఇండియా ప్రపంచం కొనియాడేలా ఇందిరమ్మ పాలన చేసిందని అన్నారు. బ్యాంకుల జాతీయకరణం, గరిబీ హఠావో నినాధంతో ప్రత్యేక కార్యక్రమాలు, కూడు, గూడు, గుడ్డ అమలు, దళితులకు భూ పంపిణీ వంటి అనేక కార్యక్రమాలను అమలు చేసిందని గుర్తు చేశారు. పేద ప్రజల, మిడిల్ క్లాస్ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ వారి అభ్యున్నతికి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.గత పాలకులు ప్రజల ప్రయోజనాలు పట్టించుకోలేదని, ఉమ్మడి రాష్ట్రంలో తమ హయాంలో నిర్మించిన శ్రీరాంసాగర్, మానేర్, నాగార్జున సాగర్, కడెం, ఎల్లంపల్లి వంటి ప్రాజెక్టులు నేటికి ప్రజలకు సేవలు అందిస్తున్నాయని అన్నారు. రైతును రాజు చేసేందుకు ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను ప్రారంభించామని అన్నారు.

మహిళలకు వడ్డీ లేని రుణాలు పథకం ప్రారంభించి రెండు సార్లు ఇప్పటికే చెల్లింపులు చేశామని అన్నారు. గత పాలకులు వడ్డీ లేని రుణాల లబ్ది మహిళలకు ఎగొట్టిందని ఆయన



విమర్శించారు. మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఐకేపి ద్వారా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలని లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మొదటి సంవత్సరం 21 వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు మహిళా సంఘాలకు అందించడంతో పాటు లోన్ బీమా, ప్రమాద బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. మహిళల ఆదాయం పెంచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, పాడి పశువుల పెంపకం, ఇందిరా శక్తి క్యాంటీన్, ఆర్టిసికి అద్దె బస్సులు, పాఠశాలలకు ఏకరూప దుస్తులు కుట్టడం వంటి అనేక మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, అర్హులైన పేదలకు నూతన రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ మన జిల్లాలో ఒక పెట్రోల్ బంక్ దివ్యాంగుల ద్వారా ఏర్పాటు చేశామని, ప్రస్తుతం మహిళా సంఘాల ద్వారా మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. మహిళా సంఘాల ద్వారా నడిపే పెట్రోల్ బంక్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా నారాయణ పేట జిల్లాలో మొదటి సారి ప్రారంభిచారని, అనంతరం సంగారెడ్డి జిల్లాలో పెట్రోల్ బంక్ ఏర్పాటైందని, రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా నడిచే 3వ పెట్రోల్ బంక్ సిరిసిల్ల జిల్లాలో ప్రారంభించామని అన్నారు. రాబోయే 3 నెలలో మహిళా సంఘాల ద్వారా మరో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పెట్రోల్ బంక్ ద్వారా లక్షల ఆదాయం వస్తుందని, ఆ నిధులను రివాల్వింగ్ ఫండ్ లో పెట్టి బాగా వినియోగించుకోవాలని అన్నారు. మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ను త్వరగా పూర్తి చేయడంలో కృషి చేసిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ ఆదికారి లక్ష్మీ రాజం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ లక్ష్మి, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

## : కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి - నగరంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి నిజామాబాద్, జూలై 31 :**

నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలకు మరిన్ని ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన నగరంలో వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాగునీటి సరఫరాను మెరుగు పర్చేందుకు అమృత్ 2.0 పథకం కింద ఖానాపూర్, కాలూర్ లలో నిర్మిస్తున్న ఈ.ఎల్.ఎస్.ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులను తనిఖీ చేశారు. మైల్ స్టోన్ ప్రకారం నిర్ణీత గడువు లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పనుల ప్రగతి గురించి అధికారులను, కాంట్రాక్ట్ సంస్థ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాప్యానికి తావు లేకుండా ఆయా విభాగాల వారీగా పనులను విభజించుకుని, ఏకకాలంలో జరిగేలా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కాలూర్ లో ట్యాంక్ నిర్మిస్తున్న ప్రాంతానికి ఆనుకుని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నందున, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. అవసరమైన సామాగ్రిని, సరిపడా సంఖ్యలో కూలీలను వినియోగిస్తూ నిర్విరామంగా పనులు జరిపించాలని, నాణ్యతతో పనులు జరిగేలా పర్యవేక్షణ చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. దుబ్బ ప్రాంతంలో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ విస్తరణ పనులను పరిశీలించారు. పనులు మందకొడిగా సాగడం పట్ల కలెక్టర్ గుత్తేదార్లను నిలదీశారు. ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగిందని, పైప్ లైన్ విస్తరణతో పాటు నల్లా కనెక్షన్ల నూతన పైప్ లైన్ పనులను కూడా ఏకకాలంలో సమాంతరంగా చేపడుతూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఖలీల్ వాడి, అహ్మదిబజార్ సమీకృత వెజ్-నాన్వెజ్ మార్కెట్ యార్డులను కలెక్టర్ సందర్శించి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ కు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడువు లోపు పనులన్నీ పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని అన్నారు. ఏ చిన్న పని కూడా పెండింగ్ లో ఉండకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యతతో పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పాత గంజును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఆక్రమణల వల్ల ట్రాఫిక్ కు అవాంతరాలు ఏర్పడుతున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి కలెక్టర్ దృష్టికి తేగా, తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం నాగారంలోని రాజీవ్ గృహకల్ప భవన సముదాయాలను పరిశీలించారు. లబ్దిదారులకు వాటిని కేటాయించేలా అవసరమైన మరమ్మతులు చేయించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. ఆకతాయిలు, అసాంఘిక శక్తులను నిలువరించేందుకు వీలుగా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. మరింత పెద్ద మొత్తంలో కంపోస్ట్ తయారీ కోసం అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు.





## సమకాలీన అంశాలతో బోధించాలి: ఎంఈఓ బట్టు రాజేశ్వర్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, శాస్త్ర సాంకేతిక, సమకాలీన అంశాలతో విద్యార్థులకు బోధించాలని, అనునిత్యం సమకాలీన అంశాలను పాఠ్యాంశాలతో క్రోడికరించి బోధించాలని, సాంకేతిక అంశాలను జోడిస్తే ఎప్పటికీ గుర్తుండి పోతుందని గురువారము ఎంఈఓ బట్టు రాజేశ్వర్, బాల్కొండ మండలం కిసాన్ నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర కాంప్లెక్స్ సమావేశంలో ఆయన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ క్యాతం నరేందర్, వేల్పూర్ శ్రీనివాస్, నేళ్ల శ్రీనివాస్, మెండోరా, ముప్కాల్, ఆర్మూరు, ఆలూరు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 2న మీనాక్షి నటరాజన్ పాదయాత్ర: మానాల మోహన్ రెడ్డి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కు కొనసాగింపుగా, 18 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజలకు మరింత చేరువగా చేయడానికి, ఏఐసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పాదయాత్రకు శ్రీకారం చుట్టారని తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఆర్మూర్ పట్టణం పివిఆర్ భవన్ లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఆగస్టు 2న అలూర్, గగ్గుపల్లి మీదుగా పాత బస్టాండ్ వరకు 10 కిలోమీటర్ల పాదయాత్ర కొనసాగుతుందని చెప్పారు. 3న ఉదయం 9 నుండి 11 గంటల వరకు పాత బస్టాండ్ లో శ్రమదానం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఉంటుందన్నారు. ఈ పాదయాత్రలో జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, బాల్కొండ నియోజవర్గం ఇంచార్జ్ సునీల్ రెడ్డి, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని మండలాల అధ్యక్షులు, చైర్మన్లు, పెద్ద మొత్తంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పాదయాత్రన విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ సాయిబాబా గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు పండిత్ పవన్, అయ్యప్ప శ్రీనివాస్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, మాజీ కౌన్సిలర్ల, ఆర్మూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్, డొంకేశ్వర్ మండల అధ్యక్షుడు భూమేష్, మండలాల అధ్యక్షులు నాయకులు పాల్గొన్నారు.



## అసరా పింఛన్ల మొత్తాన్ని పెంచాలి: ఎమ్మార్పీఎస్ డిమాండ్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

ఎన్నికల హామీ మేరకు అసరా పింఛన్ల మొత్తాన్ని పెంచి, అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ పేర్కొన్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో గురువారము మండల అధ్యక్షుడు గద్దల రాజేశ్వర్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం దివ్యాంగులకు 6వేలు పింఛను, ఆసరా పింఛన్లు 4 వేలకు పెంచుతూ పింఛన్లు ఇస్తామని, అధికారంలోకి వచ్చి 18 నెలలుగా మాట తప్పారని, రాష్ట్రంలో 45 లక్షల మంది పింఛన్ దారులను మోసం చేసినట్లేనని అన్నారు. వీటిని పెంచకపోతే ఉద్యమం తప్పదని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం రాజేష్ మాదిగ పాల్గొన్నారు.



## పరిశుభ్రతపై విద్యార్థులకు ఎస్ఐ అవగాహన

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎస్సై శైలేందర్ సందర్శించారు. పాఠశాల కనీస వసతులు, తరగతుల నిర్వహణ పరిశీలించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు బృందం పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## రోగులకు పండ్లు, బ్రేడ్లు పంపిణి.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత పట్టణ బిజెపి పార్టీ మాజీ అధ్యక్షుడు క్యామ భాస్కర్ జన్మదినం సందర్భంగా హాస్పిటల్ లో, రాజావళి దర్గా దగ్గర రోగులకు పండ్లు, బ్రేడ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. విజయ్ యాదవ్, కిన్నెర అర్జున్ కుమార్, కాడుదాసు సతీష్, రఘురాం, డి. సి. రాజశేఖర్, ఎం. రామకృష్ణ రెడ్డి తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## రచయిత ప్రేమ్ చంద్ జయంతి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నవలా రచయిత ప్రేమ్ చంద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రేమ్ చంద్ పేద, మధ్య తరగతి స్థితిగతులపై చక్కని ఉపన్యాసాలు, కథలు రాశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గణేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో గురువారం బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సాగర్ యాదవ్, గాండ్ల రాజేష్, ఇద్దరి బాధితులకు 80 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ చెక్కుల మంజూరు కి చొరవ తీసుకున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కన్నపోశెట్టి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేంపల్లి చిన్న బాలరాజు, జాపు మల్లేష్ పాల్గొన్నారు.



## సుప్రీంకోర్టు తీర్పు ఫిరాయింపులపై బిఆర్ఎస్ నిజ స్వరూపం బయటపెట్టింది: మొహమ్మద్ షబ్బీర్ అలీ

సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్ బ్యూరో

అధికార కాంగ్రెస్‌కు విధేయత చూపిన 10 మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ స్వాగతించారు. ఈ తీర్పు స్పీకర్, రాజ్యాంగ అధికారాన్ని స్పష్టంగా నిరూపించడమేనని, బిఆర్ఎస్ ఒకప్పుడు దోపిడీ చేసిన అధికారాలను ఇప్పుడు ప్రశ్నిస్తున్న దాని ముఖంపై చెంపదెబ్బని అన్నారు. ఈ తీర్పు మేము ఊహించిందే. సుప్రీంకోర్టు స్పీకర్ అధికారాలను స్పష్టంగా సమర్థించింది. అసెంబ్లీ మరియు న్యాయవ్యవస్థ రెండూ వాటి స్వంత అధికార పరిధి కలిగిన స్వతంత్ర సంస్థలని పేర్కొంది. స్పీకర్ పాత్రను అణగదొక్కడానికి ప్రయత్నించిన కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. బిఆర్ఎస్ ద్వంద్వ ప్రమాణాలు, రాజకీయ అవకాశవాదమని ఆయన ఆరోపించారు. “తన పాలనలో సామూహిక ఫిరాయింపులను రూపొందించి, పదే పదే ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని విస్మరించిన బిఆర్ఎస్, ఇప్పుడు తన సొంత రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి రాజ్యాంగ నిబంధనల వెనుక దాక్కునేందుకు ప్రయత్నించడం విడ్డూరమని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తెలంగాణలో రాజకీయ ఫిరాయింపుల సంస్కృతిని ప్రోత్సహించారని పేర్కొన్నారు. దేశంలో మరే ఇతర నాయకుడు కేసీఆర్ లాగా ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని క్రమపద్ధతిలో బలహీన పరచలేదు. గత 10 సంవత్సరాలుగా, చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోకుండా కనీసం 43 మంది ఎన్నికైన ప్రతినిధుల ఫిరాయింపులకు ఆయన దోహదపడ్డారని అన్నారు. కేసీఆర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ఎమ్మెల్సీల ఫిరాయింపు కారణంగా నేను శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా పదవిని కోల్పోయాని అన్నారు. నిర్దిష్ట ఉదాహరణలను ఉటంకిస్తూ, తెలంగాణ ఏర్పడిన రోజు జూన్ 2, 2014న, ఇద్దరు బీఎస్పీ ఎమ్మెల్యేలు – ఇంద్రకరణ్ రెడ్డి, కోనేరు కోనప్ప బిఆర్ఎస్ లో చేరినప్పుడు ఫిరాయింపుల ఆచారం ప్రారంభమైందని గుర్తు చేశారు. తరువాత, టిడిపి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తన పార్టీకి రాజీనామా చేయకుండా మంత్రిగా నియమితులయ్యారు. టిడిపి ఎమ్మెల్యేగా ఉంటూ 14 నెలలకు పైగా ఆ పదవిలో కొనసాగారు. ఇది రాజ్యాంగ నిబంధనల ఉల్లంఘన కాదా అన్నారు. కెసిఆర్ మొదటి పదవీకాలంలో (2014%–%2018) 4 మంది ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలు మరియు 18 మంది ఎమ్మెల్సీల ఫిరాయింపును బిఆర్ఎస్ నిర్వహించింది. రెండవ పదవీకాలంలో (2018%–%2023) 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మరియు 2 టిడిపి ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి ఫిరాయించారు. “ఇవి ఒకేసారి జరిగిన సంఘటనలు కావు. అవి రెండు పదవీకాలాలలో రెండేళ్ల వ్యవధిలో జరిగాయి. ఫిరాయింపులను చట్టబద్ధం చేయడానికి మరియు ఉప ఎన్నికలను నివారించడానికి కెసిఆర్ స్పీకర్ కార్యాలయాన్ని ఉపయోగించారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు రాజ్యాంగంలో ఇప్పటికే ఉన్న దానిని కోర్టు మరింత బలోపేతం చేసింది – అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకునే పూర్తి అధికారం స్పీకర్‌కు ఉంది. స్పీకర్ అధికారాలను కోర్టు తగ్గించలేదని, కాలపరిమితితో కూడిన పద్ధతిలో త్వరిత చర్య తీసుకోవాలని ఆదేశించిందని చెప్పారు. సందేశం స్పష్టంగా ఉంది: రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకూడదు లేదా స్తంభింపజేయ'హాడదని అన్నారు. స్పీకర్ అధికారాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి బిఆర్ఎస్ చేసిన ప్రయత్నం తిప్పికొట్టిందని అన్నారు. ఈ తీర్పు బిఆర్ఎస్ కపటత్వాన్ని బహిర్గతం చేయడమే కాకుండా రాజ్యాంగ ప్రక్రియలపై ప్రజల విశ్వాసాన్ని కూడా పునరుద్ధరించింది. ఒకప్పుడు ఫిరాయింపులను చట్టబద్ధం చేయడానికి స్పీకర్ కార్యాలయాన్ని ఉపయోగించిన కేసీఆర్ ఇప్పుడు అదే సంస్థను ప్రశ్నిస్తున్నారు. ఆ వైరుధ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిందని ఆయన అన్నారు.



## బ్యాంకులలో,ఏటీఎం లలో ఉన్న భద్రత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించిన -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :




ప్రజల ఆర్థిక రక్షణకై జిల్లా పోలీసులు మరియు బ్యాంకు అధికారులతో గురువారం రోజు పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు గల ముఖ్య సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అధ్యక్షతన సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రధాన బ్యాంకుల ముఖ్య అధికారులు మరియు రీజనల్ అధికారులు పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎంతగానో నమ్ముతూ బ్యాంకుల నందు తమ డబ్బులు నగదు,బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉంటాయని నమ్మి పోలీసు వ్యవస్థపై నమ్మకంతో ఉంటారని దానిని వమ్ము చేయకుండా,కలిసికట్టుగా పనిచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేద్దామని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ముఖ్యంగా బ్యాంకు లాకర్ల నందు ఏటీఎంల నందు బ్యాంకు చెస్టుల నందు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సెన్సార్ లను సీసీటీవీ కెమెరాలను అలారం వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ అలారం వ్యవస్థ బ్యాంక్ అధికారులకు దగ్గర్లో ఉన్న పోలీసు అధికారులకు వచ్చే విధంగా చూడాలన్నారు. నెలకు ఒకసారి ఏటీఎంలో వద్ద,బ్యాంకుల వద్ద భద్రతా చర్యలు విషయంపై సెల్ఫ్ ఆడిట్ చేసుకుంటూ పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. రాత్రి సమయాలలో ప్రత్యేకంగా బ్యాంకుల వద్ద ఏటీఎం ల వద్ద గస్తీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏటీఎంల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవడం మంచిదని సూచించారు. అధిక మొత్తంలో నగదు తరలించే సమయంలో వీలైనంత సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తంగా ఉండే వారిని నియమించుకోవాలని సూచించారు. జాతీయ రహదారితో ఉన్న ఏటీఎం ల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని దానితోపాటు వారాంతపు సమయంలో ఎక్కువ నగదు ఉండకుండా బ్యాంకు నియమాలను అతిక్రమించకుండా తగు చర్యలను చేపట్టాలని సూచించారు. దొంగలు నవీన పద్ధతులను ఉపయోగించడంతో మరింత అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ పెరిగిపోయిన కారణంగా మోసాలకు పాల్పడుతున్న వారి అకౌంట్లను ఫ్రీజ్ చేసే విధంగా వెంటనే చర్యలు చేపట్టాలని దీనికి జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేకంగా ఒక సైబర్ క్రైమ్ బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మ్యూల్ అకౌంట్ ద్వారా సైబర్ నేరాలు జరుగుతున్న కారణంగా వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని,వాటి వివరాలను ఎప్పటికప్పుడు పోలీసు అధికారులకు చేరవేస్తూ,అందజేయాలని సూచించారు. మ్యూల్ అకౌంట్ ల సమాచారం వివిధ బ్యాంకుల సమన్వయంతో పోలీసు అధికారులతో కలిసికట్టుగా ఉంటూ నేరాల నియంత్రణ కృషి చేయాలని సూచించారు. ప్రతి ఏటీఎంల నందు రెండు డివిఆర్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న బ్యాంకులు మరియు ఏటీఎంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి బి సురేందర్ రావు,డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి,పట్టణ సిఐలు బి సునీల్ కుమార్,సిహెచ్ కరుణాకర్ రావు,కె ఫణిదర్,బ్యాంకు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పంత్ రికవర్ కావడానికి కనీసం 6 వారాల సమయం పట్టొచ్చు



పంత్ రీహ్యాబిలిటేషన్ ప్రాసెస్ మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. 'నేను కోలుకోవాలని అభిమానుల నుంచి వస్తున్న విషెస్‌లు, వారు చూపిస్తున్న ప్రేమను అభినందిస్తున్నా. మీ దీవెనలే నాకు కొండంత బలాన్ని అందించి, నాలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తాయి. క్రమంగా నా కాలి గాయాన్ని నయం చేసుకునే పనిలో పడ్డాను. ఫ్రాక్చర్ పూర్తిగా నయం కాగానే రీహ్యాబిలిటేషన్ మొదలు పెడతాను. ఓపికగా ఉంటూ రొటీన్‌లను పాలో అవుతూ గాయం నుంచి కోలుకోవడానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాను. దేశానికి ఆడటమనేది నా జీవితంలోనే గర్వకారణమైన సందర్భం. నేనెంతో ప్రేమించే ఆటను ఆడేందుకు వేచిచూడలేకపోతున్నాను' అని పంత్ నోట్ షేర్ చేశాడు. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ స్టార్ట్ కానుంది. అప్పటి వరకు ఫిట్‌నెస్ సాధించాలనే పట్టుదలతో పంత్ ఉన్నాడు. అతడు రికవర్ కావడానికి నెలన్నర సమయం పట్టినా, ఆలోగా కోలుకుంటే టీ20 ఫార్మాట్‌లో జరిగే ఆసియా కప్‌కి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అందులోనూ ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తో మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ హైవోల్టేజ్ మ్యాచ్‌ల్లో తన పవర్ చూపించాలనే పట్టుదల మీద పంత్ ఉన్నాడు. అయితే, ప్రస్తుత టీ20 జట్టులో పంత్ ఉండట్లేదు. అతడి ప్లేస్‌లో సంజు శాంసన్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. కానీ సంజూ పెద్దగా సక్సెస్ అవ్వట్లేదు. దీంతో పంత్ తిరిగి టీ20 స్క్వాడ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. పంత్ సంకల్పం గురించి కొత్తగా చెప్పడానికి ఏం లేదు. ఘోర ప్రమాదం నుంచి బయటపడి ఊహించని విధంగా రీఎంట్రీ ఇచ్చాడు. ఏ ఫార్మాట్‌లో ఆడినా రికార్డులు బ్రేక్ చేస్తున్నాడు. ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టులో 37 పరుగుల వద్ద రివర్స్ స్వీప్ ఆడబోయి కాలికి గాయం చేసుకున్నాడు. గాయం పెద్దదైనా రెండో రోజు టీమ్ అవసరాల కోసం కుంటుకుంటూనే క్రీజులోకి వచ్చాడు. హాఫ్ సెంచరీ పూర్తి చేసి టీమిండియా స్కోర్ బోర్డ్‌ని 350 పరుగులు దాటించాడు. ఈ టెస్టుని డ్రాగా ముగించడంలో పంత్ చేసిన పరుగులు కూడా కీలకంగా మారాయి. అవసరమైతే, రెండో ఇన్నింగ్స్‌లో కూడా పంత్ బ్యాటింగ్‌కి వచ్చేవాడేనని క్రికెట్ మాజీలు చెబుతున్నారు. మూడో టెస్టులో వికెట్ కీపింగ్ చేస్తుండగా పంత్ ఎడమచేతి బొటనవేలికి గాయమైంది. దీంతో ధ్రువ్ జురెల్ (%ఐప్రతీబజ జీబతీవశ్రీ%) వికెట్ కీపింగ్ చేశాడు. నాలుగో టెస్టులోనూ అతడే కీపర్‌గా ఉన్నాడు. ఇప్పుడు ఇంగ్లాండ్ టూర్ నుంచి పంత్ ఔట్ కావడంతో ఐదో టెస్టులో ధ్రువ్ జురెల్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ చివరి టెస్టు జులై 31 నుంచి లండన్‌లోని ఓవల్ స్టేడియంలో ప్రారంభం కానుంది.



# ఐదో టెస్టు నుంచి బుమ్రా ఔట్



ఇంగ్లాండ్‌తో జరగబోతున్న కీలకమైన ఐదో టెస్టుకు ముందు బూమ్రా వార్త టీమ్ ఇండియాను కలవరపెడుతోంది. ఓవల్ వేదికగా జరగనున్న ఈ చివరి మ్యాచ్?కు టీమ్ ఇండియా స్టార్ బౌలర్ జస్ప్రీత్ దూరమయ్యే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. బుమ్రా స్థానంలో ఆకాశ్ దీప్?కు ప్లేయింగ్ ఎలెవన్?లో చోటు దక్కే ఛాన్స్?లు ఉన్నాయని పేర్కొన్నాయి. జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి ఇవ్వాలని బీసీసీఐ వైద్య బృందం సలహా ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అలాగే వెన్ను గాయం తిరగబెట్టకుండా ఉండడం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని బుమ్రాకు రెస్ట్ ఇవ్వాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో యార్కర్ స్పెషలిస్ట్ ఐదో టెస్టుకు దూరం కానున్నట్లు సమాచారం. అంతకుముందు టీమ్ ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ జట్టు కూర్పుకు సంబంధించి కీలక వ్యాఖ్యలు చేశాడు. ఐదో టెస్టులో జట్టు కూర్పుపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నాడు. బుమ్రాతో సహా అందరూ బౌలర్లు ఫిట్?గా ఉన్నారని పేర్కొన్నాడు. చివరి టెస్టులో బుమ్రా ఆడతాడా? లేదా అనే దానిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశాడు. ఆఖరి మ్యాచ్?లో ఎవరు ఆడినా దేశం కోసమేనని అభిప్రాయపడ్డాడు. అంతలోనే బుమ్రా ఐదో టెస్టుకు దూరం కానున్నాడనే వార్తలు టీమ్ ఇండియా ఫ్యాన్స్ ను ఒకింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. కాగా, ఇంగ్లాండ్?తో ఐదు టెస్టుల సిరీస్?లో బుమ్రా అన్ని మ్యాచ్?లు ఆడదని బీసీసీఐ ముందుగానే ప్రకటించింది. లీడ్స్, ట్రాఫోర్డ్, మాంచెస్టర్?లో జరిగిన టెస్టులు ఆడిన బుమ్రా, ఎడ్జ్ బాస్టన్ వేదికగా జరిగిన రెండో టెస్టుకు దూరంగా ఉన్నాడు. ఆ టెస్టులో బుమ్రా స్థానంలో దిగిన ఆకాశ్ దీప్ అదరగొట్టాడు. ఏకంగా 10 వికెట్లు తీసి కూల్చి ఇంగ్లాండ్ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ పతనాన్ని శాసించడంతో పాటు టీమ్ ఇండియా గెలుపులో కీలక పాత్ర వహించాడు. ఇప్పుడు ఆఖరి టెస్టులో బుమ్రాలో ప్లేస్?లో ఆకాశ్ దీప్ జట్టులో చేరే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. బుమ్రా నాలుగో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్?లో 33 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఒకే ఇన్నింగ్స్?లో ఇన్ని ఓవర్లు అతడు బౌలింగ్ వేయడం ఇదే తొలిసారి. 33 ఓవర్లలో 103 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. ఒక టెస్ట్ ఇన్నింగ్స్ లో 100కి పైగా పరుగులు ఇవ్వడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ సిరీస్?లో బుమ్రా బౌలింగ్ లో వేగం కూడా బాగా తగ్గింది. 140 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వేసిన బంతుల సంఖ్య భారీగా తగ్గిపోయింది.

# లేని నిబంధనలు అమలు చేస్తున్నారు పిచ్ క్యూరేటర్ పై గిల్ విమర్శలు



ద ఓవల్ పిచ్ క్యూరేటర్ లీ ఫోర్టిస్ పై భారత టెస్ట్ జట్టు కెప్టెన్ శుభమాన్ గిల్ ఫైరయ్యాడు. ఈ టూర్ లో నాలుగు టెస్టులు ఆడినప్పటికీ, ఫోర్టిస్ లా వేరే ఇతర మైదాన క్యూరేటర్ ప్రవర్తించ లేదని పేర్కొన్నాడు. మంగళవారం పిచ్ ను పరిశీలిస్తున్న భారత బృందం దగ్గరికి వచ్చిన ఫోర్టిస్.. పిచ్ ను రెండున్నర మీటర్ల దూరం నుంచి పరిశీలించాలని సూచించాడు. అలాగే గ్రౌండ్ మధ్యలోకి కూలింగ్ బాక్స్ తీసుకు రావద్దని కాస్త రూడ్ గా ప్రవర్తించాడు. దీంతో భారత హెడ్ కోచ్ గౌతం గంభీర్, ఫోర్టిస్ మధ్య వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. తామెప్పటి నుంచే క్రికెట్ ఆడతున్నామని, రూల్స్ విషయం తమకు చెప్పవద్దని గంభీర్ కాస్త ఘాటూగా బదులిచ్చాడు. దీనికి సంబంధించిన ఫూటేజీ సోషల్ మీడియాలో వైరలైంది. మాజీ క్రికెటర్లతో సహా,క్రికెట్ అభిమానులు ఈ సంఘటనపై షాకయ్యారు. గతంలో ఏ పిచ్ క్యూరేటర్ కూడా ఈ విధంగా ప్రవర్తించాలేదని మండి పడుతున్నారు. ఇక తాజాగా ఈ ఘటనపై గిల్ మాట్లాడుతూ.. తనకు తెలిసినంత వరకు పిచ్ ను రెండున్నర మీటర్ల దూరం నుంచి పరిశీలించాలనే రూల్ లేదని పేర్కొన్నాడు. తాము మాములు షూలను మాత్రమే ధరించామని, ఫోర్టిస్ ఇలా చెప్పడం సరికాదని వ్యాఖ్యానించాడు. స్పైక్స్ ఉన్న షూలను వేసుకున్నట్లయితే పిచ్ పాడయ్యే అవకాశం ఉంటుందని, తాము మాత్రం రబ్బర్ స్పైక్స్ లేదా బేర్ ఫూట్ తోనే ఉన్నామని, ఫోర్టిస్ ఇలా ఎందుకు చెప్పాడో అర్థం కాలేదని తెలిపాడు. అలాగే ఇప్పటివరకు ఆడిన నాలుగు టెస్టుల వేదికల క్యూరేటర్లు ఇలా ప్రవర్తించ లేదని గుర్తు చేశాడు. ఇక తొలి రెండు టెస్టుల వరకు సాఫీగా నడిచిన ఈ సిరీస్ ను మూడో టెస్టు నుంచి కాస్త ఉద్రిక్తంగా నడిచింది. ముఖ్యంగా రెండో ఇన్నింగ్స్ లో ఆట చివర్లో ఇంగ్లాండ్ ఓపెనర్లు బ్యాటింగ్ చేయడానికి రావడానికి తాత్సారం చేయడం, పదే పదే సమయం వృథా చేయడంతో గిల్ ఫైరయ్యాడు. ఆ తర్వాత భారత బ్యాటింగ్ సమయంలోనూ ఇంగ్లాండ్ ఆటగాళ్లు స్లెడ్జింగ్ కు దిగారు. ఇక నాలుగో టెస్టు మాండేటరీ అవర్ తర్వాత మ్యాచ్ ముగిద్దామని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రతిపాదించగా, భారత ఆటగాళ్లు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ తిరస్కరించారు. దీంతో ఇది కూడా వివాదానికి దారితీసింది. మొత్తానికి గత రెండు టెస్టుల నుంచి సిరీస్ హాట్ హాట్ గా సాగుతోంది. తాజాగా దీనికి తోడు పిచ్ క్యూరేటర్ వివాదం అగ్నికి ఆజ్యం పోసినట్లయ్యింది. ఇక పిచ్ వివాదంపై స్పందించేందుకు బెన్ స్టోక్స్ నిరాకరించడం కొసమెరుపు.

నుంచి సిరీస్ హాట్ హాట్ గా సాగుతోంది. తాజాగా దీనికి తోడు పిచ్ క్యూరేటర్ వివాదం అగ్నికి ఆజ్యం

# ప్రో కబడ్డీ లీగ్ కు రంగం సిద్ధం

ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ ఘనంగా ప్రారంభమయ్యేందుకు రంగం సిద్ధమైంది. ఈసారి నాలుగు వేదికల్లో టోర్నీని నిర్వహించేందుకు ప్లాన్ రెడీ చేశారు నిర్వాహకులు. ఆగస్టు 29 నుంచి ప్రారంభం కానున్న ఈ లీగ్‌లో వైజాగ్, జైపూర్, చెన్నై, ఢిల్లీ అంతటా 12 జట్లు ట్రోఫీ కోసం తలపడతాయి. ఈ టోర్నమెంట్ ఆగస్టు 29న వైజాగ్‌లోని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య మ్యాచ్ జరగనుంది. అదే రోజు రెండో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్, పుణేరి పల్టన్స్ తలపడనున్నాయి. అయితే ఈ మ్యాచ్‌లకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రో కబడ్డీ లీగ్ నిర్వాహకులు విడుదల చేశారు. దాదాపుగా ఏడేళ్ల తర్వాత వైజాగ్ వేదికగా కబ్బడ్డీ మ్యాచ్‌లు జరగనున్నాయి. దీంతో కబ్బడ్డీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే హోమ్ టీమ్ అయిన తెలుగు టైటాన్స్ 2018లో చివరిసారిగా ఆరోస్థానాన్ని చేరినా.. ఆ తర్వాత జరిగిన అన్ని సీజన్లలో టేబుల్‌లో అట్టడుగుకే పరిమితమైంది. ఈసారైనా బలంగా సత్తా చాటాలని తెలుగు టైటాన్స్ జట్టు ప్రణాళికలు రచిస్తుంది. వైజాగ్‌లో మ్యాచ్‌లు ముగిసిన తర్వాత రెండో భాగం జైపూర్ లోని ఇండోర్ హాల్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మూడో దఫా చెన్నై.. చివరిగా ప్లేఆఫ్ మ్యాచ్‌లు ఢిల్లీ వేదికగా జరగనున్నాయి. ప్రస్తుతం లీగ్ షెడ్యూల్ విడుదల చేసిన ప్రో కబ్బడ్డీ లీగ్ నిర్వాహకులు.. ప్లే ఆఫ్స్ షెడ్యూల్‌ను త్వరలోనే రిలీజ్ చేయనున్నారు. ఈ ప్రో కబ్బడ్డీ సీజన్ 12 ను స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్ లేదా జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.




# వైభవ్ సూర్యవంశీకి బిగ్ ఛాన్స్..

## ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ఎంపిక..



ఆస్ట్రేలియా పర్యటన కోసం బుధవారం నాడు భారత అండర్-19 జట్టును ప్రకటించింది. ఇంగ్లాండ్ పర్యటనలో అద్భుత ప్రదర్శన చేసిన టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీని సెలక్టర్లు ఆస్ట్రేలియా పర్యటనకు కూడా ఎంపిక చేశారు. ఈ పర్యటన యువ ఆటగాళ్లకు తమ ప్రతిభను చాటేందుకు గొప్ప అవకాశంగా చెప్పవచ్చు. సీఎస్కే తరఫున అరంగేట్రం చేసిన యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే కెప్టెన్సీలో బీసీసీఐ 17 మంది ఆటగాళ్లను ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసింది. 5 మంది స్టాండ్‌బై ప్లేయర్ల జాబితాను కూడా సెలక్షన్ ప్యానెల్ ప్రకటించింది. సెప్టెంబర్‌లో జరగనున్న ఆస్ట్రేలియా పర్యటనలో భారత అండర్-19 జట్టు, ఆస్ట్రేలియా అండర్-19 టీంతో 3 వన్డేలు, 2 మల్టీ డే మ్యాచ్‌లు ఆడేలా షెడ్యూల్ చేశారు. మల్టీ డే మ్యాచ్ 4 రోజులపాటు జరుగుతుంది. సెప్టెంబర్ 21న మొదటి మ్యాచ్ జరగనుంది. ఈ పర్యటనలో చివరి మల్టీ డే మ్యాచ్ అక్టోబర్ 7 నుంచి అక్టోబర్ 10 వరకు జరుగుతుంది. %ఖూా%లో అరంగేట్రంలోనే అద్భుత ప్రదర్శన చేసిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఇంగ్లాండ్ పర్యటనకు సెలక్ట్ చేయగా.. చారిత్రాత్మక ప్రదర్శన చేసి అనేక రికార్డులు తన పేరిట లిఖించుకున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనలో భారత అండర్ 19 జట్టుకు ఆయుష్ మాత్రే సారథిగా వ్యవహరించనున్నాడు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటివరకు 5 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో 100 పరుగులు, 6 లిస్ట్ %ూ% మ్యాచ్‌లలో 132 రన్స్, 8 %ు%20లలో 265 పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్ అండర్-19 జట్టుతో ఆడిన 7 మ్యాచ్‌లు (5 వన్డేలు, 2 టెస్టులు)లో వైభవ్ సూర్యవంశీ మొత్తం 445 పరుగులు చేశాడు. ఇందులో 143 పరుగుల చారిత్రాత్మక శతక ఇన్నింగ్స్ కూడా ఉంది. వైభవ్ కేవలం 78 బంతుల్లోనే ఆ ఘనత సాధించాడు. ఈ ఇన్నింగ్స్‌లో వైభవ్ 10 సిక్సర్లు, 13 ఫోర్లు బాదడం విశేషం.


# కేకేఆర్ జట్టు కెప్టెన్‌గా కేఎల్ రాహుల్?



ఇంగ్లండ్‌లో కేఎల్ రాహుల్ బ్యాట్ పరుగుల వర్షం కురిపిస్తోంది. ఈ సిరీస్‌లో ఇప్పటికే రెండు సెంచరీలు సాధించిన రాహుల్‌పై ఒక సంచలన వార్త బయటికొచ్చింది. ఐపీఎల్ 2026లో కేఎల్ రాహుల్ ఢిల్లీ క్యాపిటల్స్ బదులు కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ఆడబోతున్నాడట. కేకేఆర్ జట్టు అతన్ని ఎలాగైనా ట్రేడ్ ద్వారా తమ స్క్వాడ్‌లోకి తీసుకోవాలని చూస్తోందని తెలుస్తోంది. గతంలో ఢిల్లీ క్యాపిటల్స్ రాహుల్‌ను రూ. 14 కోట్లకు కొనుగోలు చేసింది. అతను 13 ఇన్నింగ్స్‌లలో 539 పరుగులు చేశాడు. ఇప్పుడు ఈ కొత్త వార్త క్రికెట్ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు ఇప్పుడు మంచి కెప్టెన్ అవసరం. గత సీజన్‌లో జట్టుకు అజింక్య రహానే కెప్టెన్‌గా ఉన్నాడు, కానీ టీమ్ ప్లేఆఫ్స్‌కు చేరుకోలేకపోయింది, వారి ప్రదర్శన కూడా నిరాశపరిచింది. దీంతో కేకేఆర్ ఇప్పుడు భారీ మార్పులకు సిద్ధంగా ఉంది. అందుకే వారు కేఎల్ రాహుల్‌ను జట్టులోకి తీసుకొచ్చి కెప్టెన్‌గా చేయాలని భావిస్తున్నారు. కేఎల్ రాహుల్ కోసం కేకేఆర్ ఏకంగా రూ. 25 కోట్ల వరకు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉందట. కేఎల్ రాహుల్ కేవలం ఒక మంచి బ్యాట్స్‌మెన్ మాత్రమే కాదు, అతను కెప్టెన్, వికెట్ కీపర్ పాత్రలను కూడా సమర్థవంతంగా పోషించగలడు. అందుకే కేకేఆర్ అతని కోసం ఇంత భారీ మొత్తాన్ని వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఐపీఎల్ 2025 వేలానికి ముందు కేకేఆర్ ఒక పెద్ద తప్పు చేసింది. టీమ్‌కు మూడో ఐపీఎల్ టైటిల్ అందించిన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌ను కేకేఆర్ రిటైన్ చేసుకోలేదు. దీని పర్యవసానంగా, అయ్యర్ పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా మారాడు. అయ్యర్ వెళ్లిపోవడంతో కేకేఆర్‌కు పెద్ద నష్టం వాటిల్లింది. మొదట కెప్టెన్ మారాడు, ఆ తర్వాత టీమ్ ఆడే విధానం కూడా మారిపోయింది. గత సీజన్‌లో 14 మ్యాచ్‌లలో కేవలం 5 మ్యాచ్‌లలో మాత్రమే గెలవగలిగింది.

# ప్రేక్షకులను ఆకట్టుకునేలా కింగ్డమ్ మూవీ

## విజయ్ అభిమానులకు పండగలాంటి సినిమా





విజయ్ దేవరకొండ సినిమా వస్తుందంటే యువతలో అమితాసక్తి నెలకొంటుంది. వరుస సినిమాలు చేస్తున్నా, బాక్సాఫీస్ వద్ద మేజిక్ క్రియేట్ చేయడంలో తడబడుతున్నారు. ఈ నేపథ్యంలో గౌతమ్ తిన్ననూరితో కలిసి ఆయన చేసిన తాజా చిత్రం 'కింగ్డమ్' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక కథలోకి వెళితే...సూరి (విజయ్ దేవరకొండ) ఓ కానిస్టేబుల్. చిన్న వయసులోనే కుటుంబానికి దూరమైన తన అన్న శివ (సత్యదేవ్) జాడ కోసం వెతుకుతుంటాడు. ఆ ప్రయత్నంలో ఉండగానే పోలీస్ అధికారులకీ సూరికి మధ్య గొడవ జరుగుతుంది. అది తన పై అధికారుల వరకూ వెళ్తుంది. అందుకు సంబంధించి విచారణ జరుగుతున్నప్పుడు ఊహించని రీతిలో సూరికి ఓ మిషన్ బాధ్యతల్ని అప్పజెబుతారు. సూరి వెతుకుతున్న తన అన్న శివ ఆచూకీ శ్రీలంక సమీపంలోని దివి అనే ఓ ద్వీపంలో ఉందని, గూఢచారిగా అక్కడ పనిచేయాలని చెబుతారు. తన అన్న కోసం ఎంత దూరమైనా వెళ్లడానికి సిద్ధమైన సూరి... పై అధికారి చెప్పినట్టే శ్రీలంకలో అడుగు పెడతాడు. అత్యంత ప్రమాదకరమైన స్మగ్లింగ్ కార్టెల్ అదుపాజ్ఞల్లో ఉన్న దివిలోకి సూరి ఎలా అడుగు పెట్టాడు?ఇంతకీ శివ ఆ దివికి ఎందుకు వెళ్లాడు? ఆ ద్వీపంలో ఉన్న తెగకీ, శివకీ సంబంధం ఏమిటి? అక్కడి తెగ 70ఏళ్లుగా ఎవరి రాకకోసం ఎదురు చూస్తూ ఉంటుంది? తన అన్నతో కలిసి సూరి తిరిగొచ్చాడా?అన్నది చిత్ర కథ. అన్నదమ్ముల చుట్టూ తిరిగే గ్యాంగ్‌స్టర్ డ్రామా ఇది. తెలుగులో ఇలాంటి కథలు కొత్తేమీ కాదు కానీ, మిగతావాటితో పోలిస్తే దీనిలో అన్నదమ్ముల బంధం, ద్వీపంలో చిక్కుకుపోయిన ఓ తెగ నేపథ్యమే 'కింగ్డమ్'ను భిన్నంగా నిలుపుతుంది. గ్యాంగ్‌స్టర్ కథలకి డ్రామా కీలకం. ఆ విషయంలో దర్శకుడు గౌతమ్ తిన్ననూరి రచన బలమైన ప్రభావమే చూపిస్తుంది. డ్రామాతోపాటు కథా ప్రపంచంలో లీనం చేసే విజువల్స్, వాటికి మరింత బలాన్నిచ్చే సంగీతం, తెరపైన పాత్రలు తప్ప నటులే కనిపించని అభినయాలు... ఇలా అన్నీ ఉన్నా ఆ స్థాయిలో భావోద్వేగాలు బలంగా పండించలేకపోయారు. 1920ల నాటి నేపథ్యాన్ని తెరపై ఆవిష్కరిస్తూ కథని ఆసక్తికరంగా మొదలు పెట్టాడు దర్శకుడు. తొలి సన్నివేశంతోనే 'కింగ్డమ్' ప్రపంచంలో లీనమయ్యేలా చేశారు. ఆ తర్వాత కానిస్టేబుల్‌గా సూరి జీవితం, అన్న జాడ కోసం అతను చేసే ప్రయత్నాలు, ఆ తర్వాత మిషన్ బాధ్యతల్ని భుజాన వేసుకునే సన్నివేశాలతో సినిమా వేగంగానే పరుగులు పెడుతుంది. కథ శ్రీలంకకి మారాక జాఫ్నా జైలు నేపథ్యంతో పాటు, సూరి, శివ... తాము అన్నదమ్ములమనే విషయం ఇద్దరికీ ఎప్పుడు తెలుస్తుందనే అంశాలు ప్రేక్షకుల్లో ఆత్రుతని, ఆసక్తిని రేకెత్తిస్తాయి. అడుగడుగునా నాటకీయతతో సన్నివేశాల్ని మలిచినా, కథకు ప్రధానంగా అవసరమైన భావోద్వేగాల్ని ఆవిష్కరించలేకపోయారు. కథ నుంచి పక్కకు వెళ్లకుండా సన్నివేశాల్ని తీర్చిదిద్దడం సినిమాకు కలిసొచ్చింది. పతాక సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. 'కింగ్డమ్' ప్రపంచాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు, సాంకేతిక బృందం పడిన శ్రమతో తెరపై స్పష్టంగా కనిపిస్తుంది. విజయ్ దేవరకొండలో ఎంత మంచి నటు-డు ఉన్నాడో మరోసారి రుజువు చేసే చిత్రమిది. సూరి పాత్రలో ఒదిగిపోయాడు. తెరపైన ఎక్కడా విజయ్ కనిపించలేదు. ఆరంభ సన్నివేశాలతో కలుపుకొంటే, తెరపైన మూడు కోణాల్లో కనిపిస్తారు. ప్రతి కోణంపైనా తనదైన ముద్రవేశారు. ముఖ్యంగా స్పై పాత్ర కోసం ఆయన మారిపోయిన విధానం, శ్రీలంక నేపథ్యంలో సాగే ఆ సన్నివేశాలపై బలమైన ప్రభావం చూపించారు. శివ పాత్రలో సత్యదేవ్ నటన మరో ప్రధాన ఆకర్షణ. ఈ ఇద్దరి తర్వాత సినిమాలో కనిపించే మరో కీలకమైన పాత్ర... మురుగన్. ఆ పాత్రలో మలయాళ నటుడు వెంకటేశ్ చాలా బాగా నటించారు. స్మగ్లింగ్ కార్టెల్‌ని నడిపే యువ నాయకుడిగా కనిపిస్తాడు. కథానాయిక భాగ్యశ్రీ బోర్సే పాత్రకి పెద్దగా ప్రాధాన్యం లేదు. సాంకేతికంగా.. సినిమా ఉన్నతంగా ఉంది. విజువల్స్ పరంగా ప్రతి ఫ్రేమ్ ఆకట్టుకుంటుంది. అనిరుధ్ నేపథ్య సంగీతం సినిమాకి ప్రధానబలం. మేకింగ్ విషయంలో దర్శకుడి ప్రతిభ అడుగడుగునా కనిపిస్తుంది. మొత్తంగా విజయ్ అభిమానులకు పండగలాంటి సినిమా అని చెప్పవచ్చు.

# కింగడమ్ మూవీని చూసి మెచ్చుకున్న హిమాన్షు


## లవ్ ఎమోజీతో ఐలవ్‌యూ అంటూ విజయ్ రిప్లై

స్టార్ కథానాయకుడు విజయ్ దేవరకొండ నటించిన కింగ్‌డమ్ చిత్రంను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొడుకు హిమాన్షు రావు వీక్షించాడు. ఈ సినిమాపై ప్రశంసలు కురిపించాడు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నా స్నేహితులతో కలిసి 'కింగ్‌డమ్' సినిమా చూశాను. ఒక థియేటర్‌లో ఇంత మంచి అనుభూతి పొందడం నాకు ఇదే మొదటిసారి!. స్క్రీన్ కూడా చాలా పెద్దగా ఉండడంతో, ప్రేక్షకులంతా సినిమాను బాగా ఎంజాయ్ చేస్తూ అరుస్తున్నారు. థియేటర్ వాతావరణం మొత్తం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉండడమే కాకుండా. చాలా ఎనర్జీ కనిపించింది. అలాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ నటన అద్భుతంగా ఉంది. సినిమా అయితే నాకు చాలా నచ్చిందంటూ హిమాన్షు రాసుకొచ్చాడు. అయితే ఈ పోస్ట్‌పై విజయ్ స్పందిస్తూ.. హిమాన్షు లవ్ యూ అంటూ లవ్ ఎమోజీలను పెట్టాడు. కాగా ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది.



# వార్-2 నుంచి ఊపిరి ఊయలగా సాంగ్ విడుదల

బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కలయికలో.. దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన, భారీ పాన్ ఇండియా యాక్షన్ చిత్రమే 'వార్ 2'. ఒక క్రేజీ మల్టీస్టారర్‌గా వస్తున్న ఈ మూవి కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఫైనల్ గా మ్యూజికల్ ట్రీ-ట్ వచ్చేసింది. వార్ 2 నుంచి 'ఊపిరి ఊయలగా' అనే లవ్ సాంగ్ విడుదలైంది. ప్రస్తుతం ఈ సాంగ్ అభిమానుల్లో, యూత్‌లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. హృతిక్ రోషన్ - కియారా అద్వానీ కెమిస్ట్రీక్రి ఇందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాఫ్ట్‌గా, ఎమోషన్‌తో నిండిన ఈ ప్రేమ గీతం ఓ ఊహించని టోన్‌ని పరిచయం చేస్తోంది. ఈ పాటకు తెలుగు లిరిక్స్‌ని రాసిన చంద్రబోస్ భావోద్వేగాన్ని అద్భుతంగా పలికించారు. శశ్వత్ సింగ్, నిఖితా గాంధీ వినిపించిన గాత్రం పాటకు మరింత ప్లస్ అయ్యింది. ఇక హృతిక్ ÷-టసైలిష్ లుక్, కియారా స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ వీడియో సాంగ్ విజువల్స్, ముఖ్యంగా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ కూడా అదిరిపోయింది. ఈ పాట విడుదలతో ÷ఔఆ 2 మూవీపై ఉన్న బజ్ మళ్లీ పీక్స్‌కి చేరింది.



# ఋణం ఇప్పిస్తానంటూ 5కోట్లకు టోకరా

## తమిళ నటుడు శ్రీనివాసన్ అరెస్ట్

తమిళ సినీ పరిశ్రమలో 'పవర్ స్టార్'గా గుర్తింపు పొందిన ఎస్. శ్రీనివాసన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఢిల్లీకి చెందిన ఓ సంస్థను రూ.1000 కోట్ల రుణం ఇప్పిస్తానంటూ హామీ ఇస్తూ, అడ్వాన్స్‌గా రూ.5 కోట్లు తీసుకుని మోసం చేసిన ఆరోపణలపై ఆయనను ఢిల్లీ పోలీసులు చెన్నైలో అరెస్ట్ చేశారు. 2010లో 'బ్లూ కోస్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ లిమిటెడ్' అనే సంస్థకు రూ.1000 కోట్లు లోన్ ఇప్పిస్తానని శ్రీనివాసన్ హామీ ఇచ్చాడట. దీనికి బదులుగా.. వారి దగ్గర నుంచి రూ.5 కోట్లు- అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. నెల రోజుల్లో లోన్ వస్తుందని రాకపోతే డబ్బులు తిరిగిఇస్తానని హామీ ఇచ్చాడు. అయితే నెల కంటే ఎక్కువ రోజులు గడుస్తున్న లోన్ మంజూరు కాకపోవడంతో మోసపోయామని గుర్తించిన సంస్థ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. అయితే ఈ కేసుపై విచారణ చేపట్టిన పోలీసులు.. దర్యాప్తులో భాగంగా రూ. 5 కోట్లు- నేరుగా శ్రీనివాసన్, అతని భార్య బ్యాంకు ఖాతాలకు బదిలీ అయినట్లు- గుర్తించారు. అంతేకాదు ఈ డబ్బుని అతడి వ్యక్తిగత అవసరాల కోసంతో పాటు- సినిమాల నిర్మాణానికి ఉపయోగిం చినట్లు తేలింది. ఇక ఈ కేసులో దర్యాప్తునకు సహకరించకుండా, విచారణకు హాజరుకాకుండా 2018 నుంచి శ్రీనివాసన్ తప్పించుకుని తిరుగుతున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో కోర్టు అతడిని నేరస్థుడిగా ప్రకటించింది. అతడు చెన్నైలో ఉన్నట్లు- తెలవడంతో అతడిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ఢిల్లీకి తరలించారు.

# విజయ్ సేతుపతిపై మహిళ ఫిర్యాదు

## నేనేంటో నా కుటుంబానికి తెలుసన్న సేతుపతి

ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీక్రి వచ్చి స్టార్‌గా ఎదిగారు నటుడు విజయ్ సేతుపతి. ఆయనపై ఓ మహిళ ఇటీవల సంచలన ఆరోపణలు చేసింది. కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని ఆమె సోషల్‌మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. దీంతో ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. తాజాగా తనపై వచ్చిన ఆరోపణలపై విజయ్ సేతుపతి స్పందించారు. తన కుటుంబం ఎంతో బాధ పడిందన్నారు. ఆమెపై తన టీమ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. నన్ను ఎన్నోఏళ్లుగా చూస్తున్నవారంతా ఆమె ఆరోపణలు చూసి నవ్వుకున్నారు. నేనేంటో నాకు తెలుసు. ఈ రకమైన తప్పుడు ఆరోపణలు నన్ను బాధించలేవు. కానీ, నా కుటుంబం, సన్నిహితులు ఎంతో కలత చెందారు. 'వీటిని పట్టించుకోకండి. ఆమె ఫేమస్ కావడం కోసం కావాలని ఇలా చేస్తోంది. కొన్ని నిమిషాలపాటు- హైలైట్ అవుతుంది. పాపం ఎంజాయ్ చేయనీయండి' అని వారితో చెప్పాను. మేము ఆమెపై సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాం. ఏడు సంవత్సరాలుగా నేను ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. ఇప్పటివరకూ దేనికీ భయపడలేదు. ఇలాంటివి ఎప్పటికీ నన్ను బాధించవు అని విజయ్ సేతుపతి వివరించారు. కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ బాగా ఉందని.. దీనివల్ల తన స్నేహితురాలు ఎంతో ఇబ్బందిపడిందని రమ్య అనే ఓ మహిళ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది. విజయ్ సేతుపతి కూడా ఆమెను ఇబ్బందిపెట్టారని తెలిపింది. తన స్నేహితురాలు మానసికంగా కుంగుబాటుకు గురైందని పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే ఆమె తన పోస్ట్‌ను కొన్ని గంటల్లో డిలీట్ చేసింది. దీంతో విజయ్ అభిమానులు ఆమెపై విరుచుకుపడ్డారు. విమర్శలు నిజమైతే పోస్ట్ ఎందుకు డిలీట్ చేశారని ప్రశ్నించారు. దీంతో ఆ మహిళ మరో పోస్ట్ పెట్టి వివరణ ఇచ్చింది. కోపంలో ఇలా చేశానని.. అది వైరల్ అవుతుందని ఊహించలేదని తెలిపింది. తన స్నేహితురాలి గోప్యత కోసం పోస్ట్ డిలీట్ చేసినట్లు- చెప్పింది.

# మనమే కొట్టినాం.. రష్మిక ట్వీట్






విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్' విడుదలై, అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అభిమానులూ, ఇండస్ట్రీ వాళ్లు సోషల్ మీడియాలో హర్షధ్వానాలు చేస్తున్న వేళ, ఓ ఎమోషనల్ ట్వీట్ అందరినీ ఆకట్టుకుంటోంది. తాజాగా నేషనల్ క్రాష్ రష్మిక మందన్న 'నీకూ, నిన్ను ప్రేమించే ప్రతి ఒక్కరికి ఇది ఎంత ముఖ్యమో నాకు తెలుసు విజయ్.. మనమే కొట్టినాం కింగ్‌డమ్. అని ట్వీట్ చేసింది. ఈ మాటల వెనుక ఉన్న భావం సూటిగా హృదయాలను తాకుతుంది. విజయ్ దేవరకొండ ఎంతగా కష్టపడ్డాడో, ఈ సినిమా మీద ఆయనకు ఎంత నమ్మకంతో ఉన్నారో - అన్ని ఈ టీ-÷-వట్ లో స్పష్టంగా కనపడుతున్నాయి. ముఖ్యంగా 'మనమే కొట్టినాం' అన్న మాటలో గర్వం, భావోద్వేగం రెండూ సమపాళ్లలో ఉన్నాయి. తాజాగా ఈ ట్వీట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంది. ఇక కింగ్‌డమ్ చిత్రం ప్రస్తుతానికి పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. విజయ్ కొత్తగా ఎంచుకున్న కథ, గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం, టె-క్నికల్ టీమ్ చూసినవాళ్లంతా సినిమా బ్లాక్ బస్టర్ అని చెబుతున్నారు. ఈ తరహా మద్దతు, ప్రేమ విజయ్ దేవరకొండకు మరో స్థాయిలో నిలిచేలా చేస్తోంది.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685